

# శ్రీ స్వామి ఓంకార్ జీవిత విశేషాలు

జననం : 1895 నిర్యాణం : 1982

కూర్పు :

**కాలెపు బాలు సుబ్రహ్మణ్యం**

ప్రథమ ప్రచురణ జనవరి 1980
ద్వితీయ ప్రచురణ జనవరి 1999
తృతీయ ప్రచురణ జనవరి 2002
చతుర్థ ప్రచురణ జనవరి 2016

ప్రతులు : 3000

ప్రకాశకులు
ద మిషన్ ఆఫ్ పీస్
**శ్రీ శాంతి ఆశ్రమము**
**తోటపల్లి కొండలు, వయా శంఖవరం-533 446**
తూ॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్
ఫోన్ : 7382009962

సర్వహక్కులు ప్రకాశకులవి.
ముద్రణ :
**మోహన్ పబ్లికేషన్లు, కోటగుమ్మం, రాజమండ్రి.**

---

**శ్రీ శాంతి ఆశ్రమ శతజయంతి ఉత్సవాలు 21-1-16 నుండి 21-1-2017 వరకు జరుపబడును. మరియు పరమ పూజ్య శ్రీ ఓంకారస్వామి 122వ జన్మదిన సందర్భముగా సమర్పించిన భక్తి పుష్పము ఈ పుస్తకము.**

---

**కృతజ్ఞతాభివందనములు**

**ఈ పుస్తక ముద్రణకు ఆర్థిక సహాయం శ్రీమతి అల్లూరి లక్ష్మీ నరసమ్మ గారు వారి భర్త కీ.శే. శ్రీ అల్లూరి వెంకట సూర్యనారాయణ రాజుగారి జ్ఞాపకార్థం అందించిరి. వారిని పరమ పూజ్య శ్రీశ్రీశ్రీ ఓంకార్‌స్వామి, పూజ్య జ్ఞానేశ్వరి మాతాజీ వారు అనుగ్రహించుగాక !**

– ఆశ్రమ యాజమాన్యం

## విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | ప్రార్థన | 04 |
| 2. | సమారాధనము | 05 |
| 3. | మనవి | 06 |
| 4. | శ్రీ స్వామి ఓంకార్ జీవిత విశేషాలు | 08 |
| 5. | ఓంకార్ ఉపదేశములు | 14 |
| 6. | స్వామి ఓంకార్ సందేశములు | 23 |
| 7. | శాంతి కేంద్రాలు | 30 |
| 8. | ఓంకార్ సూక్తులు | 33 |
| 9. | మోక్షసాధనములు | 35 |
| 10. | సోదరి సుశీలాదేవి | 39 |
| 11. | సోదరి జ్ఞానేశ్వరి | 40 |
| 12. | ప్రముఖుల దృష్టిలో స్వామిఓంకార్ | 42 |
| 13. | శాంతి ప్రార్థన | 44 |
| 14. | తోటపల్లి శాంతి ఆశ్రమ విభాగములు | 50 |
| 15. | ప్రభుత్వాలు, ధర్మ సంస్థలు, విజ్ఞుల కర్తవ్యం | 51 |
| 16. | శ్రీ శాంతి ఆశ్రమము–ఆశ్రమ శాఖల అడ్రసులు | 52 |
| 17. | శ్రీ శాంతి ఆశ్రమ వివిధ శాఖలలో జరుగు కార్యక్రమములు | 54 |
| 18. | శాంతిని పొందదలచిన సాధకులకు స్వాగతం పలుకుతోంది శ్రీ శాంతి ఆశ్రమం. | 56 |

ॐ

## ప్రార్థన

ఓమ్ నమోస్త్వనంతాయ సహస్రమూర్తయే
సహస్రపాదాక్షి శిరోరు బాహవే
సహస్రనామ్నే పురుషాయ శాశ్వతే
సహస్రకోటి యుగధారిణే నమః

యతః సర్వాణి భూతాని ప్రతిభాన్తి స్థితానిచ,
యత్రైవోపశమం యాన్తితస్మై సత్యాత్మనే నమః
జ్ఞాతా జ్ఞానం తదాజ్ఞేయం దృష్టుదర్శన దృశ్యభూః
కర్తా హేతుః క్రియా యస్మాత్తస్మైజ్ఞ స్త్యాత్మనే నమః
స్ఫురన్తి శీకరా యస్మాదానన్దస్యామ్బ రేవనౌ,
సర్వేషాం జీవనం తస్మై బ్రహ్మా నన్దాత్మనే నమః

ఓం ! ఓం !! ఓం !!!

## సమారాధనము

శబ్ద బ్రహ్మము, పరబ్రహ్మము అని బ్రహ్మము ద్వివిధములు. శబ్ద బ్రహ్మము ఓంకారము. దాని పేరే ప్రణవము. ప్రణవముచే పర బ్రహ్మము మనకు పరిచిత మగును. దేనిచే బ్రహ్మానుభూతి కలుగునో అది ప్రణవము. ఇది సర్వదా జీవపర మాత్మల కలయికను తెలుపుచుండును. ఆ పరబ్రహ్మము జ్ఞానస్వరూపము. అంతా జ్ఞానమయమైననాడు రెండవది లేకుండుటచే అభయము కల్గును. సర్వము తానే యగుటచే విశ్వప్రేమ ఏర్పడును. ఇట్టి విశ్వమున ఏకత్వభావన, ప్రేమ భావన కల్గించునది ఓంకారము. ఆ ఓంకారమే మూర్తిదాల్చి మన స్వామిగా అవతరించినది. అందుచే మన స్వామి భయరహితమగు తత్త్వము విశ్వమునంతను తానుగా భావించిన మూర్తి- ప్రేమయే రూపుదాల్చిన మూర్తి. "నమేద్వేష్యోస్తి నప్రియః". "నాకు ద్వేషియు లేడు-ప్రియుడులేడు" అని శ్రీకృష్ణ భగవానుడు పలికినాడు. కాని మన స్వామి "నాకు ద్వేషియు లేడు, అందరూ నాకు ప్రియులే" అనెడు మధురమూర్తి. వారి సన్నిధి సర్వ మానవకోటికే కాదు. అచేతనములకు కూడ ప్రేమ పరస్పందనమును కల్గించును. వారి జీవితము మనము స్మరించుకొనుచూ మన జీవితమును సరిచేసుకొనుట చాల ఆవశ్యకము, వారి వాక్కులే ఉపదేశసారములు. వారుచేసిన చేతలే లోక హితములు. వారి తలంపులే సర్వలోక శ్రేయస్సం దాయకములు. అట్టి మహనీయుల జీవిత విశేషములు సేకరించి అందరకు అందించవలెనని సత్సంకల్పము కలిగిన శ్రీ కాలెపు బాలసుబ్రహ్మణ్యముగారు తాము తరించి ఇతరులను తరింపజేసిన మహనీయ మూర్తి. శ్రీ స్వామి ఓంకార్ జీవిత విశేషాలు నెరింగి ప్రతి మానవుడును తమ జీవితమును సన్మార్గమున ప్రవర్తింపజేసి ఆధ్యాత్మిక ప్రగతి నొందెదరు గాక, ఈ సదవకాశమును నా కొసంగినందులకు కృతజ్ఞుడను.

ఇట్లు
దైవభావన కల
స్వామీజీ అత్యంత భక్తుడు
శ్రీ భాష్యం అప్పలాచార్యులు.

కాకినాడ,
03-01-1974

## మనవి

120 సం।।లకు పైగా అకుంఠిత, ఆదర్శ, ఆధ్యాత్మిక జీవిత అనుభవంతో, ఆధునికాల ఆచరణకు అనుగుణ్యమైన, అభ్యుదయకర ఆధ్యాత్మిక తత్త్వమును జాతి, మత, దేశ భాషాది విచక్షణ లేకుండా, విశ్వమానవ సౌభ్రాతృత్వంతో ప్రబోధించుచున్న **సద్గురువు.**

ప్రప్రథమమున స్వర్గాశ్రమములో హిమవత్పర్వతములలో ఋషికేశ్ సమీపమున అనేక కష్టములకు ఓర్చి ఘోర తపసుల చేసిన **మహాతపస్వి.**

ఆధ్యాత్మిక అంధకారం ఆవరించి, ఆంతరంగిక, అంతర్జాతీయ సంఘర్షణలతో సతమతమవుతున్న సమాజానికి ఆరిపోని అఖండ శాంతి జ్యోతిని ప్రజ్వ లింపచేస్తున్న **శాంతిదూత.**

ఆరు సంవత్సరాలు ఏకాంతముగ, మౌనిగా విశాఖలోని కైలాసగిరిపై తపశ్చర్య సాగించి, ఆత్మానుభూతిని పొంది, పరమ సత్యాలను ప్రవచించి, ఇప్పుడు మరల మహామౌనిగా పరమాత్మ పవిత్ర పరికరంగా లోకానికి దివ్య సందేశాన్ని ప్రసారం చేస్తున్న **మహామౌని.**

సకల మతముల, తత్త్వముల, యోగముల, సిద్ధాంతములలోని మంచిని సేకరించి, సమగ్ర దృష్టితో పరిశీలించి, స్వయంగా ఆచరించి, పరిశోధించి, తదుపరి వివరించిన విజ్ఞానవేత్త, "SOUL OF OMKAR,

AUTO BIOGRAPHY OF OMKAR, SOHAM, OM JAPA, CONTROL OF MIND, GOD-REALLIZATION NOW AND HERE" వంటివి ఎన్నో సుజ్ఞాన పూరితమైన గ్రంధాలు: Peace, శాంతి పత్రికలు ద్వారా సజీవ జ్ఞాన స్రవంతిని ప్రవహింప జేసియున్న **జ్ఞాననిధి.**

సకల జనుల శ్రేయస్సుకై సమాజంలో సద్ధర్మ సంస్థాపనకు "సత్యం వద, ధర్మంచర" అనెడు సదాశయంతో సత్, చిత్ ఆనందముతో, సర్వే సర్వత్ర కృషి చేసిన **కర్మయోగి.**

**సద్గురువు, మహాతపస్వి, శాంతిదూత, మహామౌని, జ్ఞానయోగి, కర్మ యోగి అయిన పరమపూజ్యశ్రీ స్వామి ఓంకార్‌జీ స్థాపించిన శ్రీ శాంతి ఆశ్రమ శతజయంతి ఉత్సవాలు 21-1-16 నుండి 21-1-17 వరకు జరుపబడును. మరియు పరమపూజ్యశ్రీ ఓంకార్ స్వామి 122వ జన్మదిన సందర్భముగా సమర్పించిన భక్తి పుష్పము, ఈ పుస్తకము.**

– ప్రకాశకులు

## శ్రీ స్వామి ఓంకార్ జీవిత విశేషాలు

ఆత్మకు జనన మరణాలు లేవు. శ్రీస్వామి ఓంకార్ విశిష్ట జీవి. ఓంకార్ ఈ దేహాన్ని ధరించి 121 సంగాలు పూర్తయింది. పరమ పవిత్రమైన జీవితంలో ప్రతిదినము, ప్రతి సంఘటన విశేషమే.

కారణజన్ముల జీవితాలు, అభ్యుదయాన్ని ఆకాంక్షించువారు అధ్యయనం చేయవలసిన సద్గ్రంధాలు. అందు ప్రతిపుట హితోప దేశమే. అసాధారణ పరిణామాలతో కూడుకొనియున్న సుదీర్ఘమైన చరిత్రగల మన స్వామీజీ జీవిత విశేషాలను ఇట్టి చిన్న పుస్తకంలో, కొద్ది పేజీలలో వివరించడం, ఎంత సంక్షిప్తంగా వ్రాసినా, మచ్చుకు మాత్రమే కాగలవు. పూర్తిగా తెలుసుకోవాలనెడు కుతూహలం కలవారు, ఆ జీవిని, జీవితాన్ని ప్రత్యక్షంగా, పరోక్షంగా గమనిస్తూ అనుసరిస్తూ అవగాహన చేసుకుంటూ, ఆచరిస్తూ అభివృద్ధి చెందుతూ సహధర్మ చర్య సాగించవలసిందే.

జీవికి జన్మ పరంపర కలదనుటకు సోదరి జ్ఞానేఏశ్వరి జీవితమే కాదు. స్వామీజీది కూడా నిదర్శనమే. ఆటపాటలనాడే ఆధ్యాత్మిక అభిరుచి, దివ్యచింతన, దైవభక్తి, దీనజనసేవ దైవారాధనగా చెయ్యాలనే అభిలాష– ఆధ్యాత్మిక అక్షరాభ్యాసమే అద్వైత తత్త్వముతో ఆత్మ విద్యాప్రాసన అష్టావక్ర గీత, అవధూత గీత, భాగవద్గీత, జీవన్ముక్తి వివేకము, వివేకచూడామణి వంటి దివ్య గ్రంథాలతో ఆ దశలోనే, అద్వైత శిఖరాన్ని అధిష్టించిన స్వామీజీ, బుద్ధ మహాశయుడు, జీసెస్ క్రైస్తు, ఆదిశంకరులు, స్వామి రామతీర్థవంటి వారు చూపిన శ్రేయో మార్గమునే వీరునుచూపి భక్తులకు మార్గదర్శకులయిరి. ఇది సర్వ సాధారణమా ? సహజమా ? పూర్వజన్మ సుకృతంగాక మరేమిటి?

## స్వయంగా తీర్చిదిద్దుకున్న జీవితం

అంతరాత్మే ఈ జీవికి గురువు, జీవిత కురుక్షేత్రములో జీవాత్మే ఈ రథానికి సారధి. చిన్ననాటి నుండి నేటివరకు – ప్రాపంచిక, ఆధ్యాత్మిక విషయాలన్నింటిలోను – అంతర్వాణి ననుసరించి నిర్ణయించుకొని, ఆత్మశక్తి పైనే ఆధారపడి, పట్టు విడవకుండా ప్రయత్నించడం ఈ జీవి ప్రత్యేకత.

జీవయాత్రలో ఎట్టి అవరోధాలు వచ్చినా, ఎటువంటి కష్టనష్టాలు కలిగినా చలించక సర్వం శ్రేయసు కొరకే అనెడు సంతృప్తితో, ద్విగుణీకృత దక్షతతో ముందుకు సాగడం గమనించదగ్గ విషయం.

అహంకారం – పరులలోఉన్నా, మనలోఉన్నా – అది అనర్థదాయకమే. అందుచే ఏ అహంకార మూర్తిపై ఎందుకు ఆధారపడునా స్వకీయ అహంకారా న్ననుసరించి ఏ పని చేసినా, అది అధోగతికి దారితీయునన్న సత్యాన్ని ఎప్పుడూ ఏమరుపాటు లేకుండా గుర్తుంచుకొని, అచంచల ఆత్మ విశ్వాసంతో, విచక్షణా జ్ఞానమనే దిక్సూచికతో నిరహంకారులై జీవితనౌకను, ఈ సామాజిక సము ద్రంలో నడుపించారు స్వామీజీ. స్వానుభవంతో కూడిన ఈ పాఠాలను వారు ప్రతి ఒక్కరికీ ప్రబోధించారు.

## మనోవాక్కాయ కర్మలలో ఏకత్వము

ఏకత్వము, సత్యము, ప్రేమ, విభిన్నత్వం అహంకార జనితం. సర్వ మతములు, తత్త్వములు, సిద్ధాంతములు, సద్గ్రంధములు ప్రబోధించు సత్యము, ఏకత్వము, ప్రేమయే అయినప్పటికీ వాటి పేరిట నెలకొల్పబడిన వ్యవస్థలు, వాటి తరపున వ్యవహరిస్తున్న వ్యక్తుల ఆచరణ తద్విరుద్ధంగా ఉండుటయే సంఘర్షణలకు హేతువగుచున్నది.

త్రికరణశుద్ధిగల స్వామీజీ, పాక్షిక పోకడలకు అతీతులు, వారు ప్రత్యేకించి ఏ ఒక్క మతానికి చెందరు. ఏతెగకు బందీయులు కారు. అయినను అందరిపట్ల సహృదయంలో గౌరవ ప్రపత్తులతో వర్తించే వారు. చిన్ననాటి నుండి మంచిని సేకరించి, సమన్వయ పూర్వకంగా ఆచరిస్తూ పురోగమించే స్వామీజీ, తన ఆధ్యాత్మిక జీవిత ఆరంభంలోనే విభిన్నత్వమునకు తావులేని తన విశ్వమతమునకు ఎంచుకున్న చిహ్నం విశ్వమత చిహ్నం.

ఆ విశ్వమత చిహ్నము పాఠకులందరూ చూచి ఆనందించుటకు వెనుక పుటలో ప్రచురించబడెను. ఆయన అవగాహనకు, దూర దృష్టికి, ప్రత్యక్ష నిదర్శనం, పరుల ప్రోత్సాహం ఏకోశంలోను లేకుండా, తనంతట తాను

ఆధ్యాత్మిక జీవితాన్ని ఎంచుకొని, స్వయంగా ఎంచుకొన్న విధానాలు ననుసరించి సాధనలుచేసి, తనకు తానుగా సన్యాసమును స్వీకరించి, "ఓంకార్" నామకరణం చేసుకోవడం, ఆయన ఆధ్యాత్మిక అవగాహన లోతుకు, ఆత్మ విశ్వాసమునకు కొలబద్ద.

ప్రత్యేకించి ఏ గురువును ఆశ్రయించక, ఏ గ్రంథాన్ని గుడ్డిగా అనుసరించక నిరహంకారిగా అందరిలోను, అన్నింటిలోని సత్యాన్ని తీసుకొని, స్వయంగా పరిశోధించి, రూపొందించుకొన్న ఆదర్శ ఆధ్యాత్మిక జీవితం స్వామి ఓంకార్‌ది. వీరి రచనలు, ప్రవచనాలు, ప్రబోధాలు పరమ పురుషుల నుండి పామర ప్రజల వరకు వారు తోటి మానవుల పట్ల అవలంబించే వైఖరి, అన్ని మనోవాక్కాయ కర్మలలో ఏకత్వమును వెల్లడిస్తాయి. నిజమైన జీవన్ముక్తులు – ఇట్లు గాక, అన్యధా ఎటుల వర్తించగలరు !

## కారుణ్యమూర్తి

ఆధ్యాత్మికంగా, అన్యధా – బాధపడే ప్రజలకు ఏవిధమైన విచక్షణ పాటించకుండా, వారి బాధల నుండి విముక్తి చెయ్యాలనెడిదే మొదటి నుండి స్వామీజీ అభిమతం. వీరి కారుణ్యం, గౌతమబుద్ధుడు, జీసెస్‌ల తరహాకు చెందును.

ఆధ్యాత్మిక విషయం వలెనే, ఇతర విషయాలలోకూడా వీరిది ఉపయుక్తమైన, ఆచరణయోగ్యమైన, కార్య సాధనకు లక్ష్యసిద్ధికి తోడ్పడు సమన్వయ విధానమై యున్నది. బాధపడే మానవులు, ఇతర ప్రాణులు శాంతించుటే స్వామీజీకి కావలసింది. అందుచేతనే ఏ వైద్య విధానాన్ని ద్వేషించక, విమర్శించక సాధ్యమైనవి వారు స్వయంగా చేశారు. ఇతరుల ద్వారా చేయించారు. మరియు ప్రభుత్వంచే ఏర్పాటు చేయించారు.

కలకత్తా హోమియో కళాశాలలో కొద్ది రోజులు చదివారు. ప్రకృతి చికిత్స గురించి స్వయంగా అధ్యయనం చేసారు, ఆచరించారు. ఆశ్రమంలో ప్రకృతి చికిత్సా కేంద్రము నడిపారు. యోగ, తాంత్రిక చికిత్సా విధానాలు, మెస్మరిజం, భారత వైద్యములతో కూడా కొద్దో గొప్పో పరిచయం ఉంది. అన్నింటికంటె ముఖ్యం దివ్యవైద్యం(Spiritual Healing), చిన్ననాటి నుండి

ఓంకార్ దివ్యవైద్యుడు(Spiritual Healer) ప్రస్తుతము తోటపల్లి శాంతి ఆశ్రమంలో అల్లోపతి, పశువుల ఆసుపత్రి, ఆశ్రమ పరిసర గ్రామాల ప్రజలకు, పశుగణానికి సేవ చేస్తున్నాయి. ఇక దివ్య వైద్యకేంద్రం (Spiritual Healing Centre) దేశం నలు మూలల వారికి విదేశాలలోని వారికి శారీరక, మానసిక రోగాల నివారణకు ప్రార్థనల ద్వారా తోడ్పడుతుంది.

పూజ్యస్వామీజీ వాల్తేరు ఆశ్రమంలో ఉంటూండగా, 1950లో కారు ప్రమాదంలో ఒక అమ్మాయి కాలు విరిగిపోయింది. ఆ కాలుకు చికిత్స చేయుటకు సజీవియైన వ్యక్తి ఎముక కావలసి వచ్చింది. అప్పుడు ఈ కారుణ్యమూర్తి తనకు అవకాశం కల్పించిన పరమాత్మను హృదయ పూర్వకంగా అభినందిస్తూ పూర్తి చైతన్యంతో కళ్ళారా చూస్తూ, తన ఎడమ కాలి ఎముక ముక్కను కోయించి (Bone Grafting) దాన మిచ్చిన దాత. ఈ నిష్కామ కర్మయోగి ప్రవచనాలతో, ఓదార్పు మాటలతో, నామమాత్రపు సహాయముతో సంతృప్తి చెందక, అవసరమై నప్పుడు సర్వభౌతిక సంపదనేగాక, రక్త మాంసాలను ఏ శరీర భాగాన్నై నను, కడకు ఆధ్యాత్మిక సంపదతో సహా దానముచేసిన త్యాగధనుడు స్వామి ఓంకార్.

## దృఢసంకల్పము

తాను నిర్యాణమును పొంది సకల విధ బాధల నుండి విముక్తి చెందుటకు మానవాళికి మార్గము చూపాలనెడి సునిశ్చయమును చేసుకున్న సిద్ధార్థుడు, తోటి మానవులను బానిసలుగా బజారులో అమ్మడం అధర్మం, అమానుషం, అవమానకరం అని ఎలుగెత్తి చాటి, బానిస వ్యాపారాన్ని అంతమొందించి బానిసలను బంధ విముక్తి చేసి, బానిసత్వాన్ని దేశంలో లేకుండా చెయ్యాలని దృఢ నిశ్చయం చేసుకున్న అబ్రహామ్ లింకను మహా శయుడు ఆదర్శం, మన స్వామీజీకి దృఢ సంకల్పం విషయమై ఆదర్శం.

పరమాత్మ సంతతియైన జీవకోటిని– ప్రాక్, పశ్చిమ విచక్షణ లేకుండ– ఆధ్యాత్మికంగా సముద్ధరించాలని, శక్తికొలది వీలైనన్ని విధాల సేవించాలనెడిది ఓంకార్ స్వామీజీ అభిమతం. ఈ సత్సంకల్పాన్ని సఫలీకృతం చేయుటకు సర్వశక్తులను ధారపోసి సర్వసముచిత విధ ముల కృషిచెయ్యాలనెడి స్వామీజీ దృఢనిశ్చయం. పట్టువిడువకుండా పనిచేయుట పుట్టుకతోనే వారికి ప్రాప్తించిన

లక్షణం. అమెరికాలో ఈ శతాబ్దం ప్రారంభారం నుండాు, బౌతిక విజ్ఞానం, భౌతిక సంపద విశేషంగా అభివృద్ధి చెందినా ఆదేశం బ్రహ్మ విద్యలో, దైవిక సంపదలో వెనుకబడాలియున్నదన్న విషయం జగమెరిగిన సత్యం. స్వామీజీ అమెరికా ప్రజాలకు ఆధ్యాత్మికంగా, శారీరక, మానసిక ఆరోగ్యాలు విషయమై సేవచేస్తు, అచ్చట నేర్చుకోవీలైన ఉపయుక్తమైన విజ్ఞానాన్ని నేర్చుకోవాలనెడాు ఉద్దేశ్యంతో విద్యార్థి దశలోనే "సిటీ ఆఫ్ బెనారస్" అను ఓడపై అమెరికా వెళ్ళెను. కాని "మానవాళి మహోన్న తికి, దీపవాహకుడుగా వచ్చిన ఆధ్యాత్మిక రాకుమారుడురావు" అని న్యూయార్కు దినపత్రికలు ప్రకటించిన మన స్వామీజీని చిన్న వయసులుచే ఆ దేశపు 'కష్టములు రూలు' ననుసరించి ఆ దేశంలో ఉండుట కవకాశం 'ఈయక' జోడు గుర్రాలు శకటంపై న్యూయార్కు వీధాలు గుండా తీసుకువెళ్ళి తిరిగి మాతృదేశానికి పంపివేశారు.

అప్పుడా విఫలయాత్ర గురించి ఎంతో విచారం కలిగినా **"కష్టాలు నుండాు, నూతనశక్తి అంధాకారం నుండాు నూతన వెలుగు లభిస్తుంది. విషాదంలో కూడా మనం లక్ష్యం వైపు పురోగమిస్తాం"** అన్న అబ్రహామ్ లింకన్ సూక్తిని సంస్కరించుకొని, తన సతలుంకల్పాన్ని నెరవేర్చుటకు శక్తిని ప్రసాదించమని దైవమును ప్రార్థించి, ఎప్పటికైనా అమెరికాలో తన విద్యుక్తధార్మాన్ని నెరవేర్చి తీరాలని దృఢారనిశ్చయం చేసుకొనెను. ఇంత పట్టుదాలగు సదాశయాలు సాధించలేని దేముంటుంది ?

ఓంకార్ స్వామీజీ తదుపరి మూడు పర్యాయములు అమెరికాలో శాంతి దూతగా, విజయప్రదమైన యాత్రలు సాగించి, దైవ కార్యమును దిగ్విజయంగా నెరవేర్చెను. దైవముపై విశ్వాసంతో దృఢార సంకల్పముతో, పట్టు విడవకుండా ప్రయత్నించి సాధించిన సత్కార్యాలు స్వామీజీ జీవితంలో ఎన్నో ఉన్నాయి.

## మౌనదీక్ష

ఆధ్యాత్మిక జీవితంలో మౌనమునకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. అహంకారమును అణచి, ఆత్మను ప్రభావితం గావించాలంటే మౌనం వహించక తప్పదు. జీవి, జీవాత్మగా వర్తించవలెనన్న, విశ్వవాప్తంగా నున్న, పరమాత్మతో తాదాత్మ్యం పొందవలెనన్న ఆధ్యాత్మిక ప్రపంచంతో సరాసరి సంబంధాలం పెట్టుకొన వలెనన్న, మౌనదీక్షను పాటించాలిలుందే.

మహా మౌనదీక్షలోనున్న మహాత్ములు, పరిశుద్ధ హృదయులు, ఏకోశం లోను అహంకారాన్ని వారు తలెత్తనీయరు. అందుచే వారు దివ్యకార్యములను సాగించుటకు ఎట్టి అవరోధాలం లేకుండ దైవమునకు ఉపయోగపడు పరమ పవిత్ర పరికరము.

సుదీర్ఘకాలం మౌనవ్రత మాచరించిన ఆధునిక మహా పురుషుడు, మెహెర్‌బాబా, రమణ మహర్షి సాధించిన ఆధ్యాత్మిక ఔన్నత్యం. మౌన దీక్షలో ఉంటూనే–ముమ్మిడాలవరం బాలయోగి శుద్ధమౌనులే. ఆనాటి నుండి ఈనాటి వరకు ఆధ్యాత్మిక పుణ్యభూమి అయిన ఈ భారత వర్షంలో హిమాలయా లలోను, ఇతర తావులలోను –ఎందరో మహనీయులు, గుప్తంగాను, బహిరంగంగాను "సర్వేజనా సుఖినో భవన్తు" అనెడి సదాశయంతో మౌనదీక్షలో ఉంటున్నారు. మహనీయుల కోవకు చెందిన మన స్వామీజీ వాల్తేరు, కైలాసగిరి పైనున్న తమ నిర్వాణాశ్రమములోఉంటూ, విశ్వశాంతికై 1950– 1956 వరకు మౌనదీక్ష బూని అవిచ్ఛిన్నంగా ఆరు సంవత్సరాలు ఆ వ్రతం సాగించారు. ఆ కాలంలో (In the Hours of silence) **"మౌనపు ఘడియలు"** అను ఉత్తమ గ్రంథాలమును రచియించిరి. దేశం నలుమూలల నుండి, విదేశాల నుండి పలువురు ప్రముఖులు విచ్చేసి, స్వామీజీని సందర్శిం చారు. అందు, కాంజన్‌గాడ్ ఆనందాశ్రమానికి చెందిన స్వామీ రామదాస్‌జీ, మాతాజీ కృష్ణాబాయి, కైలాసగిరి ప్రకృతి సౌందర్యాన్ని, మౌనతపసులోనున్న ఓంకార్‌జీని చూచి అచ్చటనున్న శాంతిని అనుభవించి, ఎంతో ఆనందిం చారు.

స్వామి ఓంకార్, స్వామి పాత్రకు స్వస్తిచెప్పి, పరిపూర్ణమైన ప్రణవమై, శుద్ధమైన ఓంకార్‌గా దివ్యకార్యములు నిర్వహించుచున్నారు.

## ఓంకార్ ఉపదేశములు

## ఇప్పుడే, ఇచ్చటే దైవ సాక్షాత్కారమును పొందుట

దైవము అంటే, ప్రాక్ పశ్చిమ మతాలలో చెప్పే, పురాణాలలో వర్ణించే దేవుళ్లుగాదు. విశ్వం యావత్తుకు ఆధారం, ఏకత్వము, అద్వితీయం, నిత్య సత్యము, నీలో, నాలో విశ్వమంతట, ప్రతి హృదయంలో, ప్రతి అణువులో ఉన్న దైవము గురించి స్వామీజీ చెప్పేది.

దివ్యత్వమును పొందుట ఏ కొద్దిమంది గుత్తసొత్తో కాదు. అది ప్రతి మానవునియొక్క జన్మహక్కు. అందుచే నీవే ఎంత త్వరగా దానిని సాధించిన, నీకు, నీకుటుంబానికి, నీ దేశానికి, యావత్తు ప్రపంచానికి అంత మంచిది. దైవమును మరచుటే మరణం. ఇప్పుడు, ఇచ్చట, నీవు దైవమును పొందగలిగిన నీవు చిరంజీవివే అంటారు ఓంకార్‌జీ.

సర్వేసర్వత్ర దైవమును చూచే విధానం, జీవిత లక్ష్యమును ఇప్పుడే, ఇక్కడే సులువుగా, సూటిగా, తప్పక సాధించ వీలైనదని మహాత్ములు, మహర్షులు చెబుతారు. సిద్ధాంతాలు, తత్త్వాలు, తర్క వితర్కాలు కన్న ఆచరణ ముఖ్యం. మన సాధనే మనది. మన సాధన నుండే మన అభివృద్ధి.

ధ్వనిలో, దృశ్యంలో, స్పర్శలో కదలికలో, యోచనలో రేచక పూరకాలలో, సమాధి స్థితిలో సర్వే సర్వత్ర దేవుని సందర్శించు విధానము స్వామి ఓంకార్ ప్రబోధిస్తారు. సర్వాంతర్యామి అయిన పరమాత్మయొక్క సృష్టి అయిన ఈ విశ్వంలో పంచభూతాల నుండి వచ్చినా, ప్రాణికోటి నుండి వచ్చినా మరెచ్చటి నుండి వచ్చినా ప్రతిధ్వని దైవముదే. నీ నుండి వెలువడునది. నీ శత్రు మిత్రుల నుండి వచ్చెడిది కూడా ఆ ఏకత్వముదే. అనుక్షణం ఈ చైతన్యం కలిగియుంటూ, అహర్నిశలు ఇదే భావంతో సాధన చేసిన కలిగే సత్ఫలితం గురించి సందేహ మెందుకు ?

ఇట్లే దృశ్యము, విశ్వం యావత్తు దైవ స్వరూపం. అందలి ప్రతి అణువు, ప్రతివ్యక్తి దైవరూపమే. నీవు ఎటు చూచినా కనిపించేది దేవుడే. సర్వకాల సర్వావస్థలయందు ఈ సాధన చేసిన నీకు కనిపించేది దైవముగాక మరేమిటి? అట్టి స్థితిలో – దైవ చింతనతో తన్మయత్వం పరమానందమే గదా !

ఇదేవిధంగా ప్రతి స్పర్శలోను, ప్రతి కదలికలోను, ప్రతి యోచన లోను, దైవ చైతన్యముతో ఉండగలిగిన ఇప్పుడే, ఇక్కడే దివ్యత్వమును పొందుటే గదా! దైవమే నీవు,నీవే దైవమగుటకాదా ? నీయొక్క ప్రతి రేచకంలోను, ప్రతి పూరకంలోను బాహ్య, అంతర్ కుంభకాలలోను సోహమ్ జపించిన ఇంతకన్న వేరేమి తపసు కావాలి. ఇది సులువైన, ప్రతి ఒక్కరికి ఆచరించ సాధ్యమైన సాధనేగదా ? ఈ విధంగా సాధన చేసిన, సర్వమును స్థంభింప చేసిన సమాధిస్థితిలో గురించి వేరే చెప్పాలా ? కావున ఓంకార్ స్వామీజీయొక్క ఈ సప్తవిధ సాధన ప్రతి ఒక్కరు నిరభ్యాంతరంగా చేయవలెనది.

ఏదైనా మంచిని గ్రహించినప్పుడు వాయిదా వేయక, వెంటనే దానిని ఆచరణలో పెట్టుట విజ్ఞత. ఈ సత్యాన్ని గుర్తించిన ప్రతి ఒక్కరు ఈ సాధనను అనుసరించి, దివ్యత్వమును పొందాలనెడిది స్వామి ఓంకార్ ఆకాంక్ష.

## స్వామీజీ ఆదర్శం

వ్యక్తిగత శాంతే, విశ్వశాంతికి దోహదకారి కావున నీ హృదయ మున ప్రప్రధమమున శాంతి నెలకొల్పుము. దానిని నీ కుటుంబమంతటికి విస్తరింపజేయుము. పిమ్మట పరిసర ప్రజాబాహుళ్యానికి ప్రసారం చెయ్యి. ఆ విధంగా ఒక హృదయం నుండి మరో హృదయానికి అందిస్తూ దేశమంతా శాంతి వ్యాప్తం కానియ్యి. మొత్తం మీద వ్యక్తిగత ఆదర్శ శాంతిమయ జీవనం ద్వారా, యావత్తు ప్రపంచం, సంపూర్ణ విశ్వశాంతి ప్రపూర్ణం కావాలనెడిది శ్రీస్వామి ఓంకార్ అభిమతం.

## ఓం జపము

"ఓం" అను అక్షరమే సర్వము. భూత భవిష్యత్కాల త్రయ పరిచ్ఛేద మగు వ్యయమేదో యదియు "ఓంకారమే"

మాండూక్యోపనిషత్ యందు చెప్పబడినది.

**"ఓమిత్యేతత్," "ఓమిత్యాత్మానం యుంజీత"**

**"ఓమితి బ్రహ్మ", "ఓంకార ఏవేదం సర్వం"**

మున్నగునవి శ్రుతి వాక్యములు, వాక్ప్రపంచమంతయు ప్రాణ ద్యాత్మ వికల్ప విషయమగు ఓంకారమే.

"ఓమ్" పరబ్రహ్మ స్వరూపం. అది అక్షర శక్తి. పరమ పవిత్ర మగు శాశ్వతమునకు గొనిపోవునది. కావున సంపూర్ణమైన అవగాహ నతో "ఓమ్"పై ధ్యానమొనర్పవలయును.

ఈ క్రింది విధముగా జపము చేయమని శివానందుని ప్రబోధము.

| | |
|---|---|
| భూమానంద స్వరూపం | ఓమ్, ఓమ్, ఓమ్ |
| సచ్చిదానంద స్వరూపం | ఓమ్, ఓమ్, ఓమ్ |
| చిన్మయోహం | ఓమ్, ఓమ్, ఓమ్ |
| అఖండైక రస చిన్మాత్రోహం | ఓమ్, ఓమ్, ఓమ్ |
| కేవల చిన్మాత్రోహం | ఓమ్, ఓమ్, ఓమ్ |
| నిర్విశేష చిన్మాత్రోహం | ఓమ్, ఓమ్, ఓమ్ |

వీటిపై విశ్వాసంతో జపం చేయువారికి అద్వైత నిష్ఠ ప్రాప్తించును.

దైవము యొక్క పవిత్ర నామమే మంత్రము. దైవముపై మనసును నిలిపి, అవిచ్ఛిన్నంగా తైలధారగా మంత్రమును స్మరించుటే జపము. దైవ తత్త్వము యొక్క ఎడతెగని భావవాహినియే ధ్యానము. ఆత్మను ప్రదీప్త మొనర్చుటకు జపధ్యానములు ఉత్తమమైనవి.

జపయోగము బహు సులభతరమైన ఆధ్యాత్మిక సాధన. ప్రస్తుత కాలమునకు తగినది. నలువైపులకు చెదిరిన మనశ్శక్తులను ఏకత్వం వైపు ప్రవహింపజేయు ఈ సాధనను, సమస్త సంశయములను విడచి, దృఢవిశ్వా సంతో, శ్రద్ధతో, పట్టు విడవకుండా, హృదయపూర్వకంగా, త్రికరణ శుద్ధితో చేయవలయును.

## జపమాచరించుటకు స్వామీజీ సూచనలు

సముద్ర తీరముననో, నది ఒడ్డుననో, కొండ ప్రక్కననో, లేక గదిలోనో ఏకాంతముగ, ప్రశాంతముగ, సంధ్యా సమయాలలో సుఖాసనంలో నడుము నిలిపి కూర్చుని, ఓంకార జపం చెయ్యాలి. జపమాచరించునప్పుడు ఓంకారము యొక్క అవగాహనతో, దైవముతో సాధకుడు తాదాత్మ్యము పొందాలి. జ్యోతులకు జ్యోతి అయి, విశ్వమంతట వ్యాప్తియై యున్న ఆ పరంజ్యోతి తానుగానే భావించుకోవాలి. సర్వ సామాన్యంగా పాడుకునే

పాటలతోగాని, పవిత్రనామములతోగాని, ఓంకారమును కలిపి, జపము ఎల్లప్పుడూ సాగించవచ్చు. అప్పుడు కూడా ఇంద్రియాలను, మనస్సును, బుద్ధి అహంకారములను అదుపులో పెట్టి సర్వవ్యాపి అయిన పరమాత్మతో ఏకత్వమును పొందాలి.

వివిధ జపములు, ధ్యాన, మౌన, సమాధి స్థితులకు పరిణామం చెందును. అయితే ఇక్కడ ధ్యానములో మనస్సును మనలోను, బయట ఓంకారంపై కేంద్రీకరించాలి. అంటే నీవు నఖ శిఖ పర్యంతం ఓంకారంగా భావించుకోవాలి. ఆ ధ్యానములో, నీలో సకల జగత్తును, సకల జగత్తులో నిన్ను భావించుకుంటూ దివ్యానుభూతిని పొందాలి.

ఓంకారమును సంస్మరించుట, పాడుట, జపించుట, ధ్యానించుట అన్నీ ఆధ్యాత్మిక ఉన్నత స్థితికి తీసుకుపోవు సాధనలే. కావున ఆధ్యాత్మిక అభ్యున్నతి నాకాంక్షించు ప్రతి ఒక్కరు ఓంకార జపమాచరించమని స్వామి ఓంకార్ స్వానుభవంతో ప్రబోధం చేసారు.

## మనో నిగ్రహం

ఓంకార్ స్వామీజీ, చాలా రోజుల క్రితమే "మనోనిగ్రహం" (Control Mind) అనే పుస్తకం వ్రాశారు. అందు మనస్సు ఏమిటో, మనోనిగ్రహం ఆవశ్యకత, దానిని సాధించు విధానం బహుచక్కగా వివరించారు.

వ్యక్తి అభివృద్ధికి, సమాజ అభ్యుదయానికి మనోనిగ్రహం అవసరం. ఇది యోగసాధకులకేగాదు, భౌతికవాదులకు, పండితులకు విద్యార్థులకు, వీరు వారననేల ఎల్లరికి ఆవశ్యమే. అన్ని దేశాలలోను దీని గురించి ఎంతోచెప్పినా, వ్రాసినా అత్యధిక సంఖ్యాకులలో అది సాధించబడలేదు.

మనోనిగ్రహం, శాంతి,పురోగమనం,పరిపూర్ణతలకు దారితీస్తే, అది లేకున్న స్వార్థం, సంఘర్షణలు అశాంతి అధోగతులకు త్రోవ చూపును.

మనస్సు అంటే ఏమిటి ? కొందరు మెదడునే మనస్సుగా భ్రమిస్తారు. అదిపొరబాటు. తలలో నున్న మెదడు (Brain) దేహేంద్రియ ములను పనిచేయించే మనస్సు (Mind) ఒకటికాదు. సముద్రమునుండి లేచే అలలవలెనే, జీవినుండి బయలుదేరే యోచనల సంపుటే మనస్సు. అహంకార ప్రకోపం ఉన్నప్పుడు వచ్చేవి సంకుచితంగాను ఆత్మ ప్రకాశం నుండి వెలువడు

భావాలు అత్యుత్తమ మైనవిగాను ఉండును. సముద్రమునకు, అలలకు తేడాలేనట్లు జీవి మనసూ ఒక్కటే. అది నెరవేర్చే విధులనుబట్టి దానికి వేర్వేరు పేర్లు పెట్టబడ్డాయి.

అదుపాజ్ఞలలో లేని అజ్ఞాని యొక్క మనసును కల్లు త్రాగి, దెయ్యం పట్టి, పిచ్చెక్కి, తేలుకుట్టిన కోతితో పోల్చవచ్చు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు, వాయువును బంధించుటకన్న, చపల చిత్తమును అదుపులో పెట్టుట కష్టమన్నారు. అయినా వైరాగ్యము, సాధనల ద్వారా మనసును స్వాధీనపర్చు కోవచ్చు. వైరాగ్యమనే పునాదులపై అభ్యాసముతో సాధననునే ఇటుకలను పేర్చుకుంటూ ఆధ్యాత్మిక సౌధమును నిర్మించవచ్చు.

అహంకార జనితమైన అజ్ఞానం–పర్యవసానంగా బయలుదేరే కోరికల పరంపర–భోగభాగ్యాలు, వస్తువాహనాలు, పదవి అధికారాలు పేరు కీర్తులు, ఆదిగా గల మనోవికారాలకు ప్రధాన హేతువు. ప్రాపంచిక వాంఛలవైపు దృష్టి (బాహ్య దృష్టి) ప్రవృత్తి ఆత్మచింతన (అంతర్ముఖము) నివృత్తి. ప్రవృత్తి సత్యానికి దూరం చేస్తుంది. నివృత్తి సత్యానికి సన్నిహితం చేస్తుంది. కావున మనసును దైవభావనతో ఎల్లప్పుడు బంధించి ఉంచాలి.

మనసును స్వాధీనపర్చుకోడానికి స్వామీజీ సూచించిన దశ సూత్రాలు: దినమునకు నాలుగు పర్యాయములు ధ్యానము చేయుట. కోరికలను విసర్జించుట పట్టు విడవకుండా సాధన సర్వము దైవమే ననెడు చైతన్యము నిత్యము కలిగి యుండుట కోరిక బయలుదేరిన వెంటనే దానిని తృంచివేయుట మరణమును దృష్టియందు ఉంచుకొని ధ్యానించుట మరల వాటివల్ల వచ్చే ప్రమాదాలను యోచించుట తన్ను తాను తెలుసుకొని లోపాలను స్వయంగా దిద్దుకొనుట ఆధ్యాత్మిక దినచర్యను వ్రాయుట పరమ లక్ష్యమును సాధించాలనెడు దృఢ నిశ్చయం కలిగియుండుట.

గాలి పీల్చుటకు, మనసుకు సంబంధం ఉంది. అందుచే ధ్యానము చేయునప్పుడు గాలిని పీల్చుట వదలుటతోపాటు "సోహమ్" మంత్రమును జపించిన, మనసు నిలుచును. క్రమస్థ అద్భుత ఫలితాలు నిచ్చును. మనలను బంధించునది, బానిసలను చేయునది అస్వతంత్రులను చేయునది మనసే. తన మనసును తాను జయించిన వ్యక్తే నిజమైన విజయుడు.

## అంతరాత్మ పై ఆధారపడుట

సర్వమతమూ, తత్త్వమూ, సనాతన ఋషి పరంపర ప్రబోధాలమూ సారాంశమును, ఆచరణకు తోడ్పడురీతిని సంక్షిప్తంగా చెప్పాలంటే Know Thyself, Be Thyself, Trust Thyself, Rely on Thyself (నిన్ను నీవు తెలుసుకో నీవు నీవుగానే ఉండు నిన్ను నీవు విశ్వసించు నీపైనే నీవు ఆధారపడు.)

ఎమర్సన్ వ్రాసిన "Self Reliance" అను గ్రంథానికి పాశ్చాత్యులు ఎంతో ప్రాముఖ్యతనిస్తారు. ఈ ప్రధాన విషయమై స్వామి ఓంకార్ సూటిగా, సూటిగా, సుస్పష్టంగా, సత్యసమ్మతంగా వివరించారు. 'నేను'అనే జీవికి రెండు అవతారాలున్నాయి. మాట వరసకి ఒకటి చిన్నది,రెండవది పెద్దది అనుకుందాం. చిన్నదంటే సంకుచితమైనది. శరీరమే తాననుకొనేది పెద్దదంటే బ్రహ్మాండమైనది. విశ్వమంతా తానైనది. మొదటిది అహం రెండవది ఆత్మ, 'చోటా'గావున్న నీవు నీవుగా వర్తించినప్పుడు స్వార్థం, బంధుమిత్ర ఆశ్రితాది వ్యామోహాలు, సంఘర్షణలు వగైరా ఏర్పడతాయి. 'బడా'గా నీవు కాగలిగినప్పుడు సత్, చిత్, ఆనందం, అస్థిరము, మాయ అయిన అహంకారా నివి కావు నీవు. సత్యము, నిత్యము అయిన ఆత్మవే నీవు. అంతరాత్మ (జీవాత్మ) పరమాత్మ ఒక్కటే. జీవిలోని అహంకారం జీవాత్మకు సంపూర్ణంగా శరణాగతం (Surrender) కావాలి. అంటే మాయ అయిన అహంకారం మాయమవ్వాలి. జీవి, జీవాత్మగా వర్తించాలి.

యువకుడుగా సాధన ప్రారంభించిన నాటి నుండూ స్వామీజీ ఈ సత్యాన్ని గుర్తించి, తదనుగుణ్యంగా వర్తించారు. నిరంతరం, నిత్య జీవితంలో సహితం, ఈ సత్యాన్ని అనుసరించుటలోనే ఓంకార్‌జీ విశిష్టత. వారి ప్రబోధాలలో అంతరాత్మపై ఆధారపడుట (Self Reliance) కు విశేష ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.

నీ హృదయానికి హృదయం–మనసూ, నీ జీవికి జీవం అయి స్వయం ప్రకాశమైన ఆత్మపై ఆధారపడక, దేనిపై ఆధారపడతావు? నీవు నీ అంతరాత్మగా వర్తించినప్పుడు సర్వం సవ్యంగా సాగిపోతుంది. నీ అంతరాత్మే నీకు గురువు, దైవము,సర్వము, దేవాలయాలు. చర్చిలు, మసీదులకే

పరిమితమైన మతాలకు, మఠాలకు, స్వర్గానికి సంబంధించిన నామరూపాల దేవుళ్ళకై దేవులాడడం సరియైనది కాదు. మన హృదయాంతరాళాలలోనే దైవమున్నది మన శరీరమే ఆ దేవుని దేవాలయం అని స్వామీజీ స్పష్టీకరించారు.

శ్లో॥ దేహో దేవాలయ ప్రోక్తో
జీవోదేవ సనాతనః
త్యజే దజ్ఞాన నిర్మాల్యం
సోఽ హం భావేన పూజయేత్

బయట గురువులపై, బంధుమిత్రులపై పరులెవ్వరిపైన అయినా ఆధారపడుట అజ్ఞానం, అమాయకత్వమే. పరాధీనత నిష్ప్రయోజనమే కాకుండా, నిస్పృహలకు హేతువు. ప్రాపంచిక జీవితంలో కూడా ఈ సత్యం వర్తిస్తుంది. అన్యులపై ఆధారపడే జీవితానికి, స్వయంగా స్వయంకృషి ద్వారా గడిపే జీవితానికి ఎంతో తేడా ఉంటుంది. పరాధీనత బానిసత్వానికి దారి తీస్తుంది. స్వకీయ సమర్థతతోనే స్వాతంత్ర్యము ముడిపడి ఉంటుంది. స్వతంత్ర జీవికే సమాజంలో గౌరవం.

జీవి, సత్యచైతన్యముతో, అచంచల విశ్వాసంతో, ఆత్మగా వర్తించిన ఎంతబలం, ఎంతధైర్యం, ఎంత సాహసం ఎంత సమర్థత లభిస్తాయి. ఆత్మశక్తికి సాటి ఏమిటి ? ఆత్మగా ప్రవర్తించుట అంటే దైవముగా వ్యవహరించుటే. అంటే ఎప్పుడో, ఎక్కడో దైవానుగ్రహాన్ని పొందుటకాదు. ఇక్కడే ఈ క్షణంలోనే తానే దైవమని తెలుసుకొనుటే. జీవి దైవము ఒక్కటే. నీ అజ్ఞానం అంతరించి, సత్యజ్ఞానమును పొంది నప్పుడు, సత్య చైతన్యము కాగలిగినప్పుడు సాక్షాత్తు సర్వాంతర్యామివే గదా ! నీవు.

పరమాత్మ యొక్క సంతతి యావత్తు ఈ ఉన్నతస్థితిని పొందుటకై పాటు పడాలనేదిది స్వామి ఓంకార్‌జీ అభిమతము.

## ఆధ్యాత్మికడైరీ

మహాశయుల జీవితాలను జాగ్రత్తగా చదివినప్పుడు, వారు, వారి జీవితాలలో సంభవించిన పురోగమనాలు, తిరోగమనాలు, అనుభవాలు డైరీలలో వ్రాసుకొని, స్వయంగా పరిశీలించుకొని చెడును త్యజిస్తూ, మంచిని పెంచుకుంటూ ఎలా పురోగమించింది గ్రహించ గలుగుతాము.

మన జీవితం, మనం తప్పక చదువుకోవలసిన సద్గ్రంధాలము. దీనిని బహుజాగరూకతతో ఎప్పటికప్పుడు చదివి, గుణపాఠాలు నేర్చుకుంటూ, లోపాలను సరిదిద్దుకుంటూ ముందుకు సాగాలి. మన నిజస్వరూపాన్ని చూపే అద్దమే, మనం సక్రమంగా వ్రాసుకున్న డైరీ. 'డైరీ' వ్రాయడం అమూల్యమైనపని. దాని విలువ అనుభవంలేని వారికి అవగాహనకాదు. అది ఒక్కరోజు కూడా తప్పకుండా శ్రద్ధగా వ్రాయాలి.

ఆధ్యాత్మిక అభ్యున్నతిని ఆకాంక్షించువారు, ఆధ్యాత్మిక 'డైరీ' తప్పక వ్రాయాలి. తన్ను తాను తెలుసుకొని స్వయం శిక్షణ ద్వారా తన జీవితాన్ని అభ్యుదయ పథంలో రూపొందించుకుంటూ, పరమాత్మక్యం వైపు పురోగమిస్తూ పరిపూర్ణతను సాధించుటకు ఆధ్యాత్మిక డైరీని అనుదినం వ్రాసుకు తీరాలిసిందేనని స్వామీజీ అభిప్రాయం.

ఆధ్యాత్మిక డైరీ ఎలా మొదలు పెట్టాలి ? ఎలా వ్రాయాలి? ఎలా పరిశీలించు కోవాలి? మొదలుగు విషయాలను గురించి ఓంకార్‌జీ.

**సూచనలు :**

1. **దైవ యోచనతో నిద్రలేవాలి –** నిద్రలేచిన వెంటనే ప్రక్కవదలి పరుగెత్తక, అలజడు, ఆందోళన లేకుండా, ప్రాపంచిక వ్యవహారాలవైపు యోచనను పోనీయక, ఆ దినమంతా తనలో, తోటి వారిలో దైవమును గ్రహిస్తూ, సాధ్యమైనంత వరకు పరులకు సేవ, సహకారాలు చెయ్యాలని స్వయం నిర్ణయంచేసుకోవాలి.

2. **ఉదయం ధ్యానము :** హెచ్చుకాలం, సుఖంగా, సక్రమంగా కూర్చో గలిగిన ఆసనాన్ని అలవర్చుకోవాలి. ప్రాతఃకాల సంధ్యా సమయంలో కనీసం 15 ని॥లకు తక్కువగాకుండా, దైవము లేక సత్యముపై ధ్యానము చెయ్యాలి. ఈ విషయమై డైరీలో వ్రాసేటప్పుడు, ఆసనం

సక్రమంగా కుదిరినదీ లేనిదీ, ధ్యాన సమయంలో మనసు ఎటు ఉన్నదీ, ఆ సమయంలో ఆధ్యాత్మిక అనుభూతులేమైన కలిగినచో అవి, ఇత్యాదులు వ్రాయాలి.

3. **ఎడతెగని చైతన్యము :** ప్రాపంచిక వ్యవహారాలు సాగిస్తున్నప్పటికి దినమంతా మనోవాక్కాయ కర్మలలో అవిచ్ఛిన్నమైన దైవ చైతన్యము కలిగియుండుటపైనే ఆధ్యాత్మిక విజయం ఆధారపడి యుండును. అందుకై హెచ్చు శ్రద్ధ చూపాలి. ఈ స్థితి ఎప్పుడు ఎటు ఉన్నది డైరీలో వ్రాసుకోవాలి. సందేహించక మంచిని, బలహీనతలను కూడా వ్రాసుకొనవలయును. సరిదిద్దుకొనుటకు అవి అవశ్యం.

4. **సాయంకాల ధ్యానము :** సాయం సంధ్యా సమయంలోకూడ. ఉదయం వలెనే, ధ్యానము చెయ్యాలి. ధ్యానము చేయుటంటే ఉన్నచోటనే ఉంటూ, కదంత్రొక్కే విధానం కాదు. ప్రతిధ్యానము లోను ఎంతో కొంత అభివృద్ధిని సాధించాలి. దృఢ నిశ్చయంతో కృషి చేసిన ఇదేమీ అసాధ్యంకాదు. **'యద్భావం తద్భవతి'** మనో నిశ్చయాన్ననుసరించే ఫలితం ఉంటుంది. ఎట్టి పరిస్థితులలోనైనా లక్ష్యమును సాధించి తీరుతాననెడి దృఢ విశ్వాసంతో సాధన చెయ్యాలి. అణిమాది సిద్ధులకై ఉబలాటపడక నిజమైన దైవశక్తి, స్థిరమైన శాంతికొరకు ప్రయత్నిం చాలి. దీనిని గురించిన వివరాలు కూడా డైరీలో వ్రాయాలి.

5. **స్వయం పరిశీలన :** పనులన్నీ ముగించుకొని పరుండబోయే పూర్వం, ఆ రోజు జరిగినవాటినన్నింటిని స్వయంగా పరిశీలన చేసుకొని డైరీ వ్రాయాలి. ఏ రోజు డైరీ ఆరోజే వ్రాయాలిగాని, కూడబెట్టి కొద్దిరోజుల తరువాత వ్రాయబూనుట సక్రమ పద్ధతి కాదు. శారీరక, మానసిక, నైతిక, ఆధ్యాత్మిక అభివృద్ధిని కోరు కొనువారు తప్పక ఈ పని క్రమబద్ధంగా చెయ్యాలి. దైవ యోచనతో నిద్రకు వెళ్ళాలి.

నవయుగం ప్రారంభమయింది. కావున నేటి నుండే సక్రమంగా సాధన ప్రారంభించి, పరమ పురుషుల పవిత్ర మార్గాన ముందుకు సాగండి! అనెడిది ఓంకార్‌జీ హితవు. మీ ఆధ్యాత్మిక సౌధ నిర్మాణానికి, మీ ఆధ్యాత్మిక డైరీ పునాది అగుగాక ! అన్నది ఆయన ఆశీర్వాదం.

# స్వామి ఓంకార్ సందేశములు

## జీవితము యొక్క విలువ

దుర్లభమైన మానవ జన్మయొక్క ఆధిక్యమును, విలువను గ్రహించినవారే కాలముయొక్క విలువను గూడ గ్రహించగలరు. నా కాలము చాల విలువైన దని - తరచుగ విలువైన కాలమును మాటలతో వ్యర్థము చేయుచున్న వారితో చెప్పుచుండును. నా కాలమే అననేల మీ కాలము మాత్రము విలువై నదికాదా ?

జంతుజాలమునకు కాలముయొక్క విలువ తెలియకున్నను పూర్వ జన్మ సుకృతముచే మానవజన్మ పొందిన మానవులు కైనను కాలము యొక్క విలువ తెలియకుండ క్షణములు నిమిషములేగాక రోజులు, వారములు, నెలలు, సంవత్సరములు కూడా వ్యర్థమైన ఆలోచనలు, నిరుపయోగమైన మాటలతో వృధా యగుచుండుట చాల విచారకర మైన అంశము కదా ?

ఈ మధ్యలను కొందరు స్త్రీలు విలువైన వస్తువులతో తమ్మలం కరించుకొని ఆశ్రమమునకు వచ్చిరి. మీరు ప్రార్థన చేయుచుంటిరా యని యడుగగా వారు లేదనిరి. వారి ఒడిలోనున్న పిల్లల అవస్థను బాలవిస్థితిని ఆలోచించగా నాకు చింత గలిగెను. "తండ్రుల హరిచేరు మనియెడు తండ్రులు తండ్రులు" యని భాగవతము చెప్పుచున్నది. తమ బిడ్డలను దైవోన్ముఖులనుగా చేయువారే నిజమైన తల్లిదండ్రులు, తాము ప్రేమించెడు తమ పిల్లల గురించి యైనను తాము ప్రార్థన చేయుచు తమ పిల్లలచే ప్రార్థన చేయించవలసిన బాధ్యత తల్లి దండ్రులకు లేదా? నోరులేని మూగ జంతువులు ప్రార్థన చేయుట లేదనిన ఆశ్చర్య ములేదు నోరు కలిగియుండలయు అన్ని జన్మలలో ఉత్తమమైన నర జన్మను పొందిన మానవులు కూడా ప్రార్థన చేయుట లేదనిన అట్టివారి నేమనవలెనో? అట్టి వారినే రెండుకాళ్ళ జంతువులని విజ్ఞులనుడులవి యుం డెరి. అమూల్యమైన జీవితములను ప్రార్థన ధ్యానాదులు చేయుచు తరించుటకు బదులు గమ్యస్థానమును మరచి జంతువులవలె కాల మును వ్యర్థము చేయరాదు ! ఇట్టి వారిని గురించియే భాగవతములో ఈ చక్కనైన క్రింది పద్యము చెప్పబడెను.

గీ॥ చేతులారంగ శివుని పూజింప డేని
నోరునొవ్వంగ హరికీర్తి నుడువడేని
దయయు సత్యంబు లోనుగా దుంపడేని
కలుగనేటికిఁదల్లుల కడుపుచేటు

**"క్షణమును వ్యర్థము చేయువారు జీవితమునంతను వ్యర్థము చేయుదురు"** అని మన ఆశ్రమములో చాలాచోట్ల వ్రాయబడియున్నది. ఈ చిన్న వాక్యములో ఎంత గంభీరమైన భావము కలదు యిట్టి మహా వాక్యమును సదా చదివిన, స్మరించిన కొంత ఉపయోగము కలుగటయేగాక, కాలము యొక్క విలువను గూడ గ్రహింపనగును.

జరిగినదానికి విచారించిన లాభములేదు. ఇది వరకు వ్యర్థ పుచ్చిన కాలము మనమెంత విచారించినను మరలరాదు. ప్రస్తుతము అమూల్యమైన క్షణమును వ్యర్థపుచ్చకుండ సద్వినియోగము చేయుడు. ఒలికిపోయిన పాలకైవిచారింపక, ఇకముందైనను పాలనొలికి పోకుండ అనగా–కాలమును వ్యర్థము కానీకుండ సదా ఎన్ని పనులలోనున్నను దైవనామస్మరణ చేయుచు, దినదినాభివృద్ధిని గాంచుచు – దీపము ఆరిపోకమునుపే తరించుటకు అహర్నిశలు ప్రయత్నము చేయవలెను.

"నేడే మనది రేపు మనది కాదు" అని మరియొక వాక్యము ఆశ్రమములో వ్రాయబడియున్నది. నేడే మనదని ఎట్లు చెప్పగలము? ఏక్షణమున ఏమి జరుగనున్నదో మనము చెప్పజాలముగదా ! మృత్యువు మనతో చెప్పియైనను రాదుకదా ! కాన ఈక్షణమే మనదని చెప్ప వలెను. మానవుని పుణ్యపాపములు మాత్రమతడు చనిపోయిన నత నిని వెంబడించును. కొదువ ఆస్తులన్నిటిని, వస్తు వాహనములన్నిటిని, సిరిసంపదలన్నిటిని ఇచ్చటనే అనగా ఈ లోకము నందే, యెచ్చటనున్న వాని నచ్చటనే వదలిపెట్టవలసియుండును. "ఎంతటిబుద్ధి డైనను మోలనున్న మోలత్రాటినైనను తనవెంట దీసుకొని పోజాలడు." అట్టి స్థితిలో తెలివిగల స్త్రీ పురుషులందరును అతి ఉత్కృష్టమైన తమ మానవ జన్మయొక్క ఆధిక్యమును గ్రహించి ఏది నిత్యమో, సత్యమో, శాశ్వతమో, దేనిని తమవెంట తీసుకొని వెళ్లగలరో, ఏది శరీరము విడచినను తమవెంట ననుసరించునో– అద్దానినే, దైవనామామృతమునే, నిరంతరము ప్రార్థనా

ధ్యానాదులు చేయుచు గ్రోలుచుండవలెను. ఈ వ్యాసము చదివిన జ్ఞాపకార్ధ ముగా శాంతి ప్రార్ధనను వల్లించి సదా స్మరించుచు తరించుడు.

దైవము మీ అందరిని ఆయురారోగ్యములతో నిరంతరము బ్రోచు గాక.

లోకాసమస్తా సుఖినోభవంతు !

22–10–54

6.00 a.m.

## జపమాల

## 85వ జన్మదిన సందేశము

జపమాల సాధకులకు ప్రారంభ స్థితిలో కొంత ఉపయోగముగా నుండును. క్రిష్ణ భక్తులు తులసిమాలను వాడుదురు. శివభక్తులు రుద్రాక్ష మాలను ఇష్టపడుదురు. కొందరు భక్తులు మంచి గంధపుమాలను కూడ వాడెదరు, ధనికులైనవారు ముత్యాల మాలలను గూడ వాడుచుందురు.

ఈ బాహ్యమాలలు దైవమును చేరుటకు కొంత సహకారిగ నున్నను, మనసు స్థిరముగ, ఏకాగ్రతగా నుండుట కష్టము. ఏకాగ్రతకు తోడ్పడేది ఒక్కటే స్థిరమైన శాంతియుతమైన జపమాల యున్నది.

## అది "సోహం జపమాల"

శాశ్వతమైన, స్థిరమైన,నిత్యమైన ఆధ్యాత్మిక జపమాల అది ఒక్కటే. దానినే 'అజపమాల' అని విజ్ఞులందురు. ఆ జపమాలను వాడెడువారులక్షకో కోటికో, ఒకరుందురని చెప్పవలెను. అట్టి జప మాలను వాడెడువారు అరుదై యుండుట చాలా విచారము, ఇదియే "సోహం" ధ్యానము, సూక్ష్మ ములో మోక్షము నిచ్చెడు అంతర్యజ్యోతిని దర్శింపచేసెడు, నిత్యమైన, శాంతి యుతమైన ధ్యానము.

ప్రియమైన శాంతి సాధకులారా ! ఆత్మసోదరీ స్వరూపులారా ! ఈ సంవత్సర జన్మదినపు కానుకగా మీ అంతర్యవృద్ధిని కోరుచు, "సోహం జపమాలను" మీకు ప్రేమ పూర్వకముగా అర్పించుటకు నా అంతరాత్మ

కోరుచున్నది. ఈ జపమాల ప్రవృత్తిపరులకు అందు బాటులో యుండదు. నివృత్తిపరులకు, దైవ కాంక్షాపరులకు అతి సన్నిహితముగా నుండును.

పెక్కుమాటలు వ్రాతలేల ? కాలము చాలా విలువైనది. అట్టి అమూల్య క్షణములను వ్యర్థము చేయువారు, జీవితమునంతయు వ్యర్థము చేసిన వారగుదురు. నేడే మనది. ఈ క్షణమునందే జన్మించితి మని నిశ్చయించుకొని సోహం ధ్యానమును ప్రతి శ్వాసతో చేయుచు తరించండాలు. ఈ అజప గాయత్రి ధ్యానమే–మన శాంతికి, దుర్లభమైన బ్రహ్మ సాక్షాత్కారమును ఇప్పుడే, ఇచ్చటనే ఈ క్షణము నందే పొందుటకు తోడ్పడును.

ప్రియ ఆత్మీయులారా ! నా యీ చిన్న జన్మదినపు కానుకను సత్వరముగా అందుకొని, మీకు లభించిన ఉత్కృష్టమైన మానవ జన్మమును ధన్యత చేసికొనుటకు, ఈ క్షణము నుండాలు నూతన జన్మను ప్రారంభించి, ఇకముందైనను ప్రతిక్షణమును దైవజ్ఞప్తితో సద్వినియోగము చేయుచు నా జన్మదినమే మీఅందరి జన్మదినముగా భావించి మీరు తరించుచు లోకశాంతికి తోడ్పడగోరెదను.

**ఇదియే అల్పమైన నా జన్మదినపు కానుక !**

**భక్తకోటికి నా ప్రేమ పూర్వకమైన అర్పణ**

సర్వేషాం మంగళం భవతు !

ఓం తత్ సత్ ఓం !

శాంతి గీతము

స్వర్గధామమున శాంతి ప్రతిష్ఠిత మగుగాక !
ఆకసంబున శాంతి వెలుగుగాక !
జలములందు శాంతిసుస్థిరంబగు గాక !
పృథ్వి యందున శాంతి కీర్తింపబడుగాక !
సకల వృక్షలతాగుల్మముల యందు శాంతినదము ప్రవహించు గాక!
సర్వగృహములందు శాంతి వ్యాపింపబడుగాక !
సమస్త చరాచరముల శాంతితో నింపబడుగాక !

ఓం శ్శాంతి శ్శాంతి శ్శాంతి

## ఆత్మ స్వరూపాలకు ప్రేమలేఖ

### ప్రియమైన నారాయణా-సజీవరూపదైవమా ! ఏకైక సత్యస్వరూప!

దైవమే ప్రేమ అందులకే సజీవ రూపదైవమగు నిన్ను ప్రేమించు చున్నాను. ప్రేమలేక జీవనము శూన్యము. కనుకనే జీవించుటకొరకై నిన్ను ప్రేమించుచున్నాను. బాహ్యాంతరములలో కన్నులు తెరచినా, మూసినా, వ్యాప్తిచెంది గోచరించు సత్యము భగవానుడే ! అందులకే నిన్ను ప్రేమించుట. నేనీ సందేశము వ్రాయుచున్నపుడు, నాగదియందు నాకుఎదురుగా గోడమీద లిఖించి యుండెడు ఒక ముఖ్య జీవిత సందేశ సూక్తి నన్నాకర్షించినది. అది ఏమనగా ! **"దైవము మనలోనే యున్న పుడు బయట వెదకుటకేల శ్రమిం తువు"** అటులనే నా వెనుక గోడమీద ఆత్మ ప్రబోధితమైన మరియొక ఉజ్వల సూక్తి వ్రాసియున్నది. అది ఏమనగా ! **"భగవంతుడు బాహ్యముననే యుండగా అంతరంగ మున వెదకుటకేల ప్రయత్నింతువు."** అతిముఖ్యము, ఉత్తేజకర మైన యీ సూత్రములు ఒక దానికొకటి విరుద్ధముగా నున్నట్లు కన్పడు చున్నవి. కాని ఈ రెంటియందును, యిపుడే, యిచటనే తమ దైనందిన జీవితంలో సాధనకొరకై ఎవరు ఉద్యుక్తులగుదురో అట్టి వారి కుపకరించు ఒక మహత్తర సత్యము యిమిడి యున్నది.

నీవు కనులు తెరచినపుడు, నామ రూప దృశ్య ప్రపంచమున గోచరించు సర్వమును, అది పూవుగాని, పక్షిగాని,లతగాని, జంతువు గాని, మానవుడు గాని దైవముగానే వీక్షించుము. నీవు కనులు మూసిన క్షణమునందు, నీ కాలిబొటన వ్రేలినుండి సహస్రారము వరకు నీ దేహమునందు వ్యాపించి యున్న ప్రతి పరమాణువునందు దైవమునే చూడుము. ఈ విధముగా సర్వత్రా వ్యాపించియున్న ఆ భగవానునే దర్శించు. దైవములేని సమయమంటూ ఒకలిప్త కాలమైనను యిది వరలో లేదు. ఇపుడు లేకుండా లేదు. ఇక మున్ముందు యుండకుండా యుండలేదు. అట్లే ఆయన లేనిచోటు ఒక పరమా ణువు మేరకూడ లేదు. ఈ విధముగా ఆయన బాహ్యాంతరములలో సర్వత్రా, ఎల్ల సమయములలో వ్యాపించి యున్నాడు. అందుకనే ఆయన సర్వవ్యాప కుడు, సర్వశక్తిమంతుడు, సర్వజ్ఞుడు మరియు శాశ్వతుడు. కన్నులుండి ఆయనను గాంచగల్గుదుమా ? దైవమును యిపుడే, యిచటనే గుర్తెరుంగుము.

మౌనము నవలంబింపుము. క్షణమైనను ఆయనను మరువ వద్దు. కన్నులు చూడగల్గిన సర్వములోనూ దైవమునే వీక్షించుము. కన్నులు మూసినా నీ అంతర్య నివాసియైన భగవానునే వీక్షించుము. ఆ విధముగా దైవమును, ప్రవృత్తి మార్గములో యున్నను నివృత్తి మార్గములో నున్నను వీక్షించుము.

వ్యక్తజగత్తులో ఆయనను దర్శించుము. మౌనజగత్తులో అంత రాంతర ములలో లీనమై, ఆయనను ప్రార్థించి, ధ్యానించునపుడు ఆయననే పొందు చున్నట్లు భావింపుము. వ్యక్తమగు యీ నామ,రూప,జగత్తునందు ప్రత్యణువు నందు దైవము యిమిడి యున్నాడు. అందుకే ఆయన బాహ్యమునందో లేక అంతరమునందో యున్నాడను మీమాంస ప్రసక్తి వదలివేయుము. నీవు చేయవలసినది ఏమనగా, "సాధన" ఇపుడూ, ఎపుడూ, సతతము, నిరంత రము, క్షణకాలమైనను మరచుటగాని, సాధన విడనాడుటగాని యుండ కూడదు. ఒకపాత్ర నుండి, మరియొక పాత్రలోనికి సతతము ప్రవహించు నూనెధారవలె సాధన చేయుము. దైవము శ్వాసకు శ్వాస. దైవమే "సోహం" శ్వాస, అఖండదివ్య తేజస్వరూప విశ్వాత్మశ్వాస. అదియే పరమార్ధ స్వరూ పము, అదియే అనంత శాశ్వత నిశ్శబ్ద బ్రహ్మము. అట్టి దైవమును ప్రతి యొక్క శ్వాసతో ప్రార్థింతువుగాక. ఈ "సోహం" మంత్రమును నిరంతరము ఓర్పుతో సతతము ఎట్టివైఫల్యము లేకుండా నుపాసించుటకు వలయుశక్తి మనకు గల్గుగాక, ప్రతి శ్వాసయందు...అదియే "నీవు", "నీవే" "సోహం", అని ఉపాసింతువుగాక. కోటి సూర్యప్రభల సమానమై బాహ్యాంతరములలో ప్రవేశించు, ఆ తేజస్సు మహిమను వీక్షించుము. **తత్త్వమసి**–అదియే నీవు. ఓ ప్రియమైన దైవస్వరూపా! నిన్ను ఇప్పుడు నిశ్చల అనంత నిశ్శబ్దము లోనికి గొనిపోయెదనుగాక!

ఓం ! ఓం !! ఓం !!!

– స్వామి ఓంకార్

## పూజ్యశ్రీ ఓంకార్‌జీ వారి సందేశముపై చిన్నవ్యాఖ్య

భగవత్ చైతన్య స్రవంతిని బహిర్గత మొనర్చులేక నిరూపించునట్టి ఒక మహోన్నత ఉజ్వల ఉద్వేగ ప్రతీకగా రూపొందించబడిన ఈ సందేశము శాంతి ఆశ్రమ మునిపుంగవులు, విశ్వప్రేమైక మూర్తి, ఋషి సప్తములు,

వందనీయులు, ఆరాధ్యులైనట్టి శ్రీస్వామి ఓంకార మహారాజ్ వారి మనోజ్ఞ భావవీచిక, అట్టి లేఖకే నా యీ చిన్నప్రస్తావన.

సకల చరాచర సృష్టిని పిపీలికాది బ్రహ్మపర్యంతము భగవంతుని స్వరూపంగా తమ దృష్టిచే వీక్షించగల్గిన విజ్ఞాన ఖనియైన ఈ మహర్షి చిత్తము నుండి యావిర్భవించినది ఉత్తేజకరమైన యీ భావతరంగము. సత్యముగా ఇది శ్రీ మద్భగవద్గీతలో నుదహరించబడిన విశ్వరూప సందర్శనమే. అట్టి యీ విశ్వరూప సందర్శన యోగము యీ భౌతిక ప్రపంచములో బహువిధ రూప, నామములతో, అహర్నిశము శ్రమించు సకల మానవాళికి తమ ధ్యేయమైన మోక్షగమ్యమునకు ఒక "తాళపు చెవి" లాంటిది. 1979వ సంవత్సరారంభములో నూతన సంవత్సర కానుకగా అపారమైన అవ్యాజ కరుణతో పరమపూజ్యులు, ప్రేమైక మూర్తియైన స్వామీ శ్రీఓంకార్‌జీ మహ రాజ్ వారు తాము పొందిన అట్టి దివ్యానుభూతిని ప్రతియొక్కరికి విరివిగా వంచిరి. అట్టి దివ్యా నందానుభూతిని, విశ్వైక ప్రేమను ఆధ్యాత్మిక కానుకగా పొందగల్గిన నీవు ఇంతకంటె మహత్తరమైన ఎట్టి బహుకీతిని బొందనేరవు. స్వామి శ్రీ ఓంకార్‌జీ అనుక్షణము ఇటువంటి దివ్యానందానుభూతిలో నిమగ్నులై తమవద్దకు విచ్చేయు సర్వజనులకు లేక శాంతి ఆశ్రమ ప్రాంగణము లోనికి విచ్చేయు సర్వులకు నిరంతరము తాము అనుభవించుచున్న దివ్యా నందమును బహూకరించుచూ, పంచుతూ, అందజేస్తూ, ధారాళముగా వెదజల్లుతున్నారు. ఈ విశ్వశాంతిమయ స్వరూపులు పవిత్ర భారతాంతర్భాగ మైన పుణ్య ఆంధ్రావని యందు మనోహరమైన తోటపల్లి కొండల నడుమ వివిధ ఫల, పుష్పశోభితమై విరాజిల్లుచు వృక్ష సంపదచే నావృతమై, శోభిల్లు చున్న శాంతిమయ కుటీరమున నుపవిష్టులై దివ్యప్రేమకు, దివ్య వెలుగునకు ఆధారభూతులై వెలుగొందు చున్నారు. విశ్వప్రేమ, దివ్య దృష్ట్యనుభూతులతో తేజస్వియై ప్రకాశించుచున్న ఈ లోకోత్తర పురుషుని స్వకీయలేఖ నీకు ఎనలేని కానుక.

నీకు బహూకరింపబడిన అట్టి కానుకకు, ప్రస్తావన రచించు మహద్భా గ్యము నాకు కల్గినది. నా యీ సంతోషము వర్ణింపనలవి కానిది ఈ లేఖను భక్తిశ్రద్ధలతో చదువుము. ప్రతి అక్షరమును, పంక్తిని, వాక్యమును లోతుగా పరిశీలించుము. ప్రతిదినము నీవు నిత్య నైమిత్తిక కార్యములలో నిమగ్నుడవు

కాక మునుపు ఉదయవేళల కొంత కాలము ఈ లేఖనే చదివి మననము చేసుకొని ధ్యానించు, నీకు ఒక నూతన ప్రపంచము ప్రస్ఫుటమగును. ఈ నూతన ప్రపంచమునంటి పెట్టుకొని, నీవు, దీని ద్వారా భగవానుని వీక్షించ గలవు. దృశ్య ప్రపంచమునకు వెనుకనున్న సత్యము గోచరించును. గీతా చార్యుల శ్రీకృష్ణ భగవానుల ప్రబోధించిన విశ్వరూప సందర్శనాయోగ రహస్యమును పొందుటకు సామర్థ్యము కలుగజేయును. సత్యముగా, నిన్ను, యిపుడే, యిక్కడనే బంధవిముక్తునిగా చేయును.

అపారమైన ప్రేమ, అవ్యాజకరుణ వెదజల్లిన మహరాజ్ శ్రీ ఓంకార్ స్వాముల వారి పాదపద్మములకు ప్రణామములు.

హరిః ఓం

–స్వామి చిదానంద

## శాంతి కేంద్రాలు

ప్రఖ్యాత అమెరికన్ తత్త్వవేత్త రేలఫ్ వాల్ డ్రో ఎమర్సన్, అన్నట్లు వ్యక్తియొక్క పొడవైన చాయలే సంస్థలు, వారి యొక్క శక్తి, సామర్థ్యాల ననుసరించే వాటి కార్యకలాపాలుంటాయి.

హిమాలయాలలో ఆరు సంవత్సరాల అఖండ తపశ్చర్యసాగించి ఆధ్యాత్మిక అభ్యున్నతిని సాధించి, ప్రాప్తించిన జ్ఞానాన్ని తోటి పరమాత్మ సంతతికి పంచాలనేపవిత్ర సంకల్పంతో యువకుడైన స్వామీజీ ప్రప్రథ మమున 1917లో తోటపల్లిలో శాంతి ఆశ్రమము నెలకొల్పెను.

భౌతికవాద దుష్ప్రభావాలతో సతమతమౌతూ, శాంతిలేక, ఆధ్యాత్మిక సుజ్ఞానానికై తహతహలాడే విదేశీయులలో జ్ఞానజ్యోతిని ప్రకాశింపజేయు టకు, శాంతిసందేశాన్ని ప్రసారం చేయుటకు స్వామి ఓంకార్ నాలుగు పర్యాయములు విదేశయాత్రలు చేశారు. పలు దేశాలలోని శాంతి పిపాసులకు స్వామీజీ ప్రబోధాలు అమృత ధారలు అయ్యాయి.

యునైటెడ్ స్టేటుల ఆఫ్ అమెరికాలోనే న్యూయార్కు నగరం, ఫిలిడెల్ఫియా, లాస్ఏంజిలు, హాలివుడ్, కాలిఫోర్నియాలలో శాంతి కేంద్రాలు ఏర్పడ్డాయి. మాతృ సంస్థను, దాని శాఖలను పోషించుటకు శాంతిమహోద్యమాన్ని ప్రపంచవ్యాప్తం చేయుటకు న్యూయార్కు రాష్ట్రంలో 1967వ సం॥లో 'స్వామి

ఓంకార్ పీస్ ఫౌండేషన్' అను పేరున రిజిష్టరు చేయబడింది. యుద్ధానంతరం జర్మనీలోని స్వామీజీ భక్తులు శాంతి కేంద్రాన్ని నెలకొల్పి “Peace” అను శాంతి పత్రికను ప్రచురించుట ప్రారంభించారు. జపాన్, హాంకాంగ్, మలేషియా, ఆస్ట్రేలియా, కెనడా, దక్షిణ అమెరికా, యూరప్, ఆఫ్రికా దేశాలలో స్వామీజీకి వేలాది సహచరులు, అనుచరులు ఉన్నారు.

1934లో వాల్తేరులో సముద్ర తీరమున-ఒడ్డును ఆనుకొని చక్కని పరిసరాలలో శాంతి ఆశ్రమ శాఖనెలకొల్పబడెను. దానికి ఉత్తరాన కొంత దూరంలో ఎత్తయిన కొండ కోనలపై యుద్ధకాలంలో ప్రభుత్వం కొన్ని కట్టడాలు కట్టింది. యుద్ధానంతరం 1946లో ఆ కట్టడాలను పడగొట్టదలచి నప్పుడు స్వామీజీ ఆపుజేసి, అచ్చట కైలాసా శ్రమమునేర్పాటు జేసి ఆ కొండకు కైలాసగిరి అని నామకరణము చేశారు. ఒక శివలింగము స్థాపించారు. ఈ ఆశ్రమంలో ఉంటూనే 1950 నుండి 1956 వరకు 6 సంగలు స్వామీజీ మౌనతపస్సు సాగించారు. ఇచ్చటనే శ్రీస్వామివారి ఆశయం ప్రకారం వారి శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని అన్ని మతాల వారికి అనుగుణంగా విశ్వమత ఆలయం-విశ్వశాంతి క్షేత్రము నిర్మాణము పూజ్య మాతాజీ వారి దివ్యశక్తిచే 1994లో ప్రారంభించబడి పూజ్యశ్రీ చిదానంద స్వామివారిచే 2000 సంవత్సరంలో యావత్ ప్రపంచానికి అంకితం చేయబడినది. ఇందు ప్రార్థన ధ్యానమందిరము, వివిధ మతముల గ్రంథములతో కూడిన గ్రంథాలయములు గలవు.

సోదరి లలితాదేవి అనే ఇంగ్లీషు భక్తురాలి కోరిక, ప్రోత్సాహంపై నీలగిరి ప్రాంతంలో కోటగిరిలో-చుట్టూ సెలయేరులతో పండ్ల, పూల తోటలతో, నివాసపు ఏర్పాట్లతో నున్న లక్ష్మి విహార్‌ను-ఓంకార్‌జీ శాంతి కేంద్రమును చేశారు. తపశ్చర్యకు, ధ్యానయోగాది ఆధ్యాత్మిక సాధనలకు ఇది చక్కటి చల్లని ప్రశాంతమైన ఆదర్శకేంద్రము.

ఉప్పాడలోని సముద్రతీరమున మౌనాశ్రమమును పేరున ఒక శాఖ స్థాపించబడెను. ఇది అచ్చటగల పల్లెవారికి ఆధ్యాత్మికముగా తోడ్పడుచూ వారి పిల్లలను ఒకక్రమ శిక్షణలో పెట్టి, వారిలో దైవభక్తిని పెంచవలెనన్న ఆశయముతోను మరియు స్వామీజీ వారి మిగిలిన జీవితమును మౌనముగా

గడుపుచు మాటలతో గాక మౌనములోనే లోకమంతటికి తోడ్పడవలెనని కోరుచు స్థాపించారు. కాని సముద్రుడు దీనిని తనలో విలీనము చేసికొనుట జరిగెను. ఆశ్రమ పాతభక్తులైన శ్రీ సి.వి.ఎస్.సూర్యనారాయణ గారు వారి ధర్మపత్ని శ్రీమతి ఆదిలక్ష్మి గారు (న్యూడాల్లీ) శాంతి ఆశ్రమము లోక శాంతి వ్యాప్తికై చేయుచున్న కృషి చూచి చాల ఆనందమును పొంది ఇంకను శాంతిని వ్యాపింపచేయుటకు ఇటువంటి ఆశ్రమ శాఖలు చాల ఆవశ్యకమని తలచి కాకినాడ పట్టణములో అశోకనగరంలో యున్న వారి విలువైన అమూల్య స్థలమును ఉచితముగా శాంతి ఆశ్రమశాఖ స్థాపనకై యిచ్చి యుండిరి. ఈ శాఖ ఒక అంతర్జాతీయ శాంతి శాఖగా రూపొందగలదని అందరూ ఆశించు చుండిరి. త్వరలో ఇందుకుడ మాతృ ఆశ్రమమువలె వివిధ కార్యక్రమములు చేయుటకు కోరుచుండిరి.

ఈ విధముగానే గాక అనేకమంది భక్తులు గృహములలో శాంతి ఆశ్రమ శాఖలు ప్రారంభించి లోకశాంతి ప్రార్థన స్మరణలో శాంతి వ్యాప్తి చేయబడుచుండెను. విజయవాడలో శ్రీనేరెళ్ళ రఘునాధరావు గారి ఆధ్వర్యంలో అచ్చటి భక్తులు "శాంతి సత్సంగమండలి" స్థాపించి లోకశాంతి ప్రార్థన వ్యాప్తికి కృషిచేయుచున్నారు.

తోటపల్లిలోని మాతృసంస్థ, పర్వత పంక్తిని ఆనుకొని సుమారు 100 ఎకరముల ఆవరణ కలిగియున్నది. ఆశ్రమ వాసుల, అతిథుల నివాసమునకు అన్ని అవసర ఏర్పాట్లతో చిన్న పెద్ద హాలు సైజుల బిల్డింగులు వృక్షచాయలలో చాలా ఉన్నవి. ఇచ్చట పోస్టాఫీసు, టెలిఫోన్, విద్యుచ్ఛక్తి వగైరా సౌకర్యాలున్నవి. జిల్లా కేంద్రమైన కాకినాడ నుంచి, సమీప రైల్వేస్టేషన్ పిఠాపురం నుంచి ఆశ్రమానికి సరాసరి బస్ సర్వీసు ఉన్నది.

జాతి, మత, కుల సిద్ధాంత, లింగ, ప్రాంతీయాది ఎటువంటి వివక్షణ లేకుండా ఆధ్యాత్మిక జిజ్ఞాసకులవారికి, శాంతి ప్రియులకు శాంతి ఆశ్రమమునకు సుస్వాగతము.

## ఓంకార్ సూక్తులు

సామాన్యులు సహితం, సులువుగా అవగాహన చేసుకొనుటకు తోడ్పడే రీతినిసూక్తులు ద్వారా ప్రబోధించం చేయడం ఓంకార్ స్వామి ప్రత్యేకత. అట్టివి మచ్చుక ఇచ్చుట కొన్ని.

- ❋ నిత్యము సత్య చైతన్యము, దైవానుభూతియే సుస్థిర జీవితము.
- ❋ అనుక్షణము ఆత్మ విచారము చేయుట.
- ❋ నిరంతరము నీలోనున్న సత్యాత్మపైనే దృష్టిని నిలుపు.
- ❋ దైవములో జీవించు! దైవములో జీవించుటకై ఇతరులకుతోడ్పడు.
- ❋ శాంతి నీ జన్మహక్కు ఎల్లప్పుడు దానిని అనుభవించు.
- ❋ శాంతికై పరితపించక పోవుట పశు లక్షణం.
- ❋ భౌతిక పరిజ్ఞానము, విషయకల్లోలిత మానవాశయములు శాంతి సామ్రాజ్యమును కనుగొనజాలవు.
- ❋ ఆధ్యాత్మిక శక్తిలేని వైజ్ఞానిక ప్రతిభ ప్రాణములేని అస్తి పంజరము వంటింది.
- ❋ మొదట నీ హృదయమును శాంతి నిలయంగా చేసుకుంటే శాంతి క్రమేణ సమాజంలో వ్యాపించి విశ్వశాంతికి ఆధారమగును.
- ❋ భౌతిక విజ్ఞాన తృష్ణ, విషయ భోగాశక్తి, కీర్తికాంక్ష దాస్యత్రయం, సత్యము, త్యాగము, ధ్యాన సౌశీల్యము మోక్షమునకు బాట.
- ❋ కాలము విలువైనది. ఈ క్షణములే మనవి దేవుని బిడ్డలను సేవిం చుట ద్వారా జీవితమును సద్వినియోగపర్చుడు.
- ❋ నిమిషాలను వ్యర్థము చేస్తే కాలము వ్యర్థమగును. కాలమును వ్యర్థము చేయువారు తమ జీవితమునే వ్యర్థము చేసుకొందురు.
- ❋ ప్రేమయే దైవము : దైవమే ప్రేమ : ప్రేమ యున్నచోటనే దైవ ముండును.
- ❋ నిన్ను నీవు ఏవిధంగా ప్రేమించుకుందువో, సర్వభూతములను కూడా అదే విధంగా ప్రేమించుము.
- ❋ ప్రేమ స్వరూపంగా జీవించు చైతన్యముతో ప్రేమను ప్రసారం చెయ్యి.

❋ సకల జగత్తును ప్రేమించుటే సర్వేశ్వరుని ప్రేమించుట.

❋ నిష్కామకర్మయే నీకు నిజంగా కావలసిన సత్ఫలితము నిచ్చును.

❋ స్వార్థం నుండి నిస్వార్థానికి అభివృద్ధి చెందుటే, సాధారణ మానవత్వం నుండి దివ్యత్వమునకు పరిణామం చెందుట.

❋ సోమరితనం బహుప్రమాదకర రోగం, సోమరి తన్ను తానే గాక ఇతరులను కూడా చెరచును.

❋ గత నీ యోచనలే నేటి నీవు. నేటి నీ యోచనలే నీ భావిష్యత్ కావున నీ యోచనల విషయమై జాగ్రత్త వహించు.

❋ గతంగతః, గతించినదానికై విచారించకు వాస్తవికమైన వర్తమానంలో జీవించు.

❋ కుపస్త మండూకానివి గాక, విశాల హృదయంతో, లోకంలోని వారంతా నీ సోదరీ, సోదరులనే వసుదైక కుటుంబ దృష్టితో వర్తించు.

❋ పరిశుద్ధతయే దివ్యత్వము, అంతఃశుద్ధి, బాహ్య శుద్ధిగలవారే దేవుని ఉత్తమ సంతానం.

❋ పరులను, లోకాన్ని సంస్కరింప పూనుకునే పూర్వం నిన్ను నీవు సంస్కరించుకో.

❋ పరుల పశువులను లెక్కపెట్టిన ప్రయోజనం లేదు. కొద్దిపాలిచ్చే చిన్న ఆవునైన స్వంతానికి కలిగియుండుట ఉత్తమం.

❋ నిస్వార్థం శాంతికి హేతువు స్వార్థం కన్నా సేవ, ధర్మానికి ప్రాధాన్యత నియ్యి.

❋ పరులకు జ్ఞానదానం చేయుట ద్వారా నీ జ్ఞానాన్ని పెంచుకో.

❋ ఇతరులు నీపట్ల ఎట్లు వర్తించాలని వాంచిస్తున్నావో, అట్లే నీవు ఇతరులపట్ల వర్తించు.

❋ నీవు సంతోషపడుటకు ఉత్తమమార్గం, ఇతరులను సంతోషపెట్టుటే. స్వార్థాన్ని త్యజించిన, సంసారాన్ని వదలి సన్యాసివి కానక్కరలేదు.

* తాత్కాలికమైన వస్తువులను త్యాగము చేయుట ద్వారా శాశ్వతమైన అభ్యుదయాన్ని పొందు.
* పని చేయని వానికి తినే హక్కులేదు.
* పరమశాంతి ప్రాప్తించెడిది బ్రహ్మజ్ఞానులకేగాని, పండితులకు కాదు.
* ప్రార్ధన, అర్హతగల హక్కును సాధించుటకే గాని, మానవజన్మ ముష్టెత్తుటకు కాదు.
* వాగాడంబరం, అపార్ధం చేసుకోడానికి, అనర్ధాలకు హేతువైతే, మౌనము పరిపూర్ణమైన ప్రశాంతతకు దారితీయును.
* నీలోని దివ్యత్వమును గుర్తించే చైతన్యము, అనుభూతి నీకున్న, నీవెట్టి క్లిష్టపరిస్థితులలోనున్నను, ఆనందమూర్తివే.

## మోక్షసాధనములు

1. ఉదయంనాలుగు గంటలకు బ్రహ్మముహూర్తమున మేల్కొనుట అలవాటు చేసికొనుడు. ఇది సాధనకు దైవధ్యానమునకు చాలా అనువైన కాలము.
2. శయ్య నుండి దైవభావనతో మేల్కొనుడు. ఓ దైవమా నేను నీ వాడను. నేడు అందరిలో నిన్ను చూచుచు ప్రేమించుచు నీసేవ జేసి తరింతును గాక ! అని ప్రార్థింపుడు. మానవసేవ మాధవ సేవ యగును.
3. బాహ్యాంతరములందు పరిశుద్ధులై కాలకృత్యములు తీర్చుకొని, హృదయము యొక్క పవిత్రతను భావించుచు దైవనామమును స్మరించుచు సూర్యోదయమునకు పూర్వమే స్నానమాచరింపుడు.
4. ఉషఃకాల సూర్యకిరణములు కెదురుగా ప్రతిదినమును కనీసమొక అరగంట కాలమయినను వుండుడు. పరిశుభ్రమగు నీటిని రోజునకు ఎనిమిది గ్లాసులైనను త్రాగుడు. రాగి పాత్రలో వుంచబడిన నీరుశ్రేష్ఠము. దాని వలన ప్రేగులు పరిశుభ్రముగా నుండును. ఆరోగ్యమే మహా భాగ్యము. ఆధ్యాత్మిక సాధనకు ఆరోగ్యము చాలా ముఖ్యము.
5. మాతృ భావముననో, పితృభావముననో, గురుభావముననో భగవంతుని ఆస్థికత్వమును విశ్వసించి, సుఖాసీనులై పవిత్ర హృదయముతో ప్రశాంతముగా మీ యిష్టదైవమును ప్రార్థింపుడు.

6. శాంతి ప్రేమలతో, బాూతదయతో మీ హృదయమును నింపు కొనుడు. దైవనామముగాని, మరే మంత్రమునుగాని, "ఓమ్" ను గాని తరచు జపించుట కువాటు చేసుకొనుడు.

7. సాధన విఘ్నము లేకుండ జేయుచుండవలెను. మొదట కొన్ని నిమిష ములు శాంతిగా దివ్యతేజసులను స్మరించుచు గడుపుడు. సాధనలో సత్ గ్రంథపఠన చాల ముఖ్యము.

8. మీరు గ్రహించినది త్వరలో ఆచరణయందుంచుటకు సదా ప్రయత్నిం చుడు. సత్య, ధర్మ ప్రేమలు ననుష్టింపుడు, "సత్యం వద– ధర్మంచర" సత్యమే జయతు "సత్యాత్ పరం న కించదస్తి" నూరు అశ్వమేధ యాగ ముల ఫలం – సత్యముతో సరితూగదు. సదా మంచిగా నుండువారు మంచినే యెల్లప్పుడును చేయు చుండ గలరు. (Be good and Do Good) ఇది మరువరాని సత్యము.

9. సాత్వికాహారమును భుజింపుడు. మత్తును కలుగజేయు తామసా హారమును వదలుడు. జ్ఞానసాధనకు మితాహారనియమ మత్యవ సరము. జీవించుటకు అత్యవసరమగు దానిని భుజించవలెను. తినుటకే జీవితము ఏర్పడలేదు.

10. మీ ప్రియతముడైన దైవము నారాధించుటకు ఒక గదిని ప్రత్యేకముగా పవిత్రముగా నుంచుకొనుడు. దానిలో మహనీయుల బొమ్మలు, వారి సుభాషితములు వ్రాసి యుంచుకొనుట మంచిది.

11. సాధన కాలమందు మీ మనసుల నాకర్షించు అవతారమూర్తుల చిత్తరు వుల ముందు అగరవత్తులు వెలిగించి ధ్యానించుట చాలా మంచిది. భగవద్గీత పారాయణ చాలా ముఖ్యము.

12. ధర్మము చేయుడు. అందులకై మీ రాబడులో కొంతభాగము కనీసము 100కి 5రూ॥ అయినను తప్పక ప్రత్యేకింపుడు.

13. మనసుచేతను, శరీరముచేతను,బ్రహ్మచర్యవ్రతులై యుండుడు. మహా పతివ్రతలకు – ఏకపత్నీ వ్రతులకు భారత భూమి పుట్టి నిల్లు. జీవితము, మతము ఒకటిగా చేయవలెను.

14. మౌనము సర్వార్థసాధనము. అది 'సర్వమును' సాధించును. అత్యవసర మైనపుడే హితముగా, మితముగా మాట్లాడుడు, వాఙ్మయము అత్యవస రము. సదా సంతోషముతో జాగ్రత్తగా మాట్లాడుట మంచిది.

15. ఇంద్రియములను స్వాధీనము చేసుకొనుట మానవ జన్మకు ముఖ్యకర్త వ్యము. అప్పుడప్పుడు ఉపవసింపుడు, కనీసము ఏకాదశి రోజునైనను ఫలహారముచేసి పాలుత్రాగుట మంచిది.

16. సాధ్యమైనంత వరకు క్లుప్తముగాను నిరాడంబరముగాను జీవించుటకు ప్రయత్నించుడు. పేదలకు అన్ని విధములా ప్రేమతో అన్నదానం- వస్త్రదానముచేసి తోడ్పడుట చాలా ముఖ్యము.

17. ప్రేమయే దైవముగావున సర్వజీవుల యెడల అహింస నవలంబించి ప్రేమించవలెను. అందరిలో దైవమును చూడుడు. తలంపులు, మాటలు, పనులు ప్రేమగా నుండవలెను.

18. స్వశక్తిని మరచుటే పిరికితనం, సదా స్వశక్తిపైననే ఆధారపడుచు జీవించుచు తరించుటకు ప్రయత్నించుడు. హనుమంతుడు స్వశక్తితో వారధిని దాటిన విషయం సదా జ్ఞాపకముంచుకోవలెను.

19. ఇతరుల తప్పులపై ఎన్నడును దృష్టిని బోనీయకుడు. కాని మీ తప్పులను తెలిసికొనుటకు సదా ప్రయత్నించుడు. మీ లోపములను జూపువారే మీకు నిజమైన మిత్రులు. వారికి కృతజ్ఞులై అట్టి లోపములను మీ జీవితమున చేయకుండుటకు సదా ప్రయత్నించుడు.

20. దినచర్య పుస్తకమొకదాని నుంచి మీరొనర్చిన మంచి చెడులను వ్రాయుచు, మీ పురోభివృద్ధికి అతిజాగ్రత్తగా ప్రయత్నించుడు.

21. కాలము చాల విలువైనది. ఈ దిగువ ఆశ్రమ సూక్తిని జ్ఞాపక ముంచు కొనుడు. క్షణములను వ్యర్థము చేయునాతడు జీవిత మంతయు వ్యర్థము జేయును.

22. పరుండునపుడు మీ దినచర్యను ఒకసారి జాగ్రత్తగ పరీక్షించి చేసిన లోపములకు పశ్చాత్తాపపడుచు, తిరిగి అట్టిలోపములు రాకుండ నుండుటకు దైవమును హృదయపూర్వకముగా ప్రార్థించవలెను.

భగవన్నామము స్మరించుచు, ఆయన తేజసూ మీ శరీరమంతయు వ్యాపించునట్లు నిత్యము భావింపుడు.

23. ఆత్మ విశ్వాసముతోను, అంతర్వాణి చెప్పిన చొప్పున సదా నడచు కొనుడు. **"సోమరులకు తినుటకు హక్కులేదు" "పనియే ఆరాధన"** యను ముఖ్య సూక్తులు మరువరాదు.

24. **"పరోపకారార్థం ఇదం శరీరం"** ఈ శరీరములు స్వార్థరహితమైన మానవసేవ చేసి తరించుటకే యివ్వబడెను. కాన, మంచి పనులే తరుచుచేయుచు, యితరుల సేవచేయుటే మన ఆనందమని మరువ రాదు.

25. ఏ దైవమునకై మీరు వెదకుచున్నారో ఆ దైవము మీకై సదా మీ హృదయ మున వేచియున్నాడు. పరమాత్మ సర్వవ్యాపి, ఆయన లేని సమయం, తావులేదు. ఎందెందు వెదకి చూచిన అందందే గలుడు.

26. మీరు సదా దైవజ్ఞప్తితో నుండాలి, ఇతరులుగూడ దైవము, ధర్మ మును మరువక, ధర్మమార్గమున జీవించుటకు సదా సహాయ పడుడు.

27. సత్య, ధర్మ, శాంతి, ప్రేమస్వరూపుడగు భగవంతుని యందు ఐక్యమొందుటకు సదా ప్రయత్నింపుడు. అప్పుడు మీ శరీరజ్ఞప్తిని మరచెదరు. బాహ్య సుఖములు మిమ్మాకర్షించలేవు. దైవమును పవిత్ర హృదయములో గమనించగలరు.

28. అన్ని వేళలయందు మీ గమ్యస్థానమైన దైవ ఐక్యతను జ్ఞప్తికి తెచ్చుకొనుచుండుడు. అప్పుడే మీ జన్మసార్థకమగును. దైవైక్యము కొరకే మీ జీవితమును సదా ధారపోయుడు. **"తండ్రీ - హరి చేరుమనియెడి తండ్రీ - తండ్రీ"** అను భాగవత వచనమును ఎవరు మరువరాదు.

29. భక్తి జ్ఞాన వైరాగ్యములు ముక్తికి మార్గం **"సోహం"** ధ్యానము జన్మరాహిత్యము నిచ్చును.

30. నిరంతరము లోకశాంతి ప్రార్థనను హృదయపూర్వకముగ భక్తితో స్మరించుచు తరించుడు. మీకుటుంబములోనున్న వారందరు. ప్రతి నిత్యము యీ ప్రార్థన చేయుట చాలా ముఖ్యము.

# సోదరి సుశీలాదేవి

సోదరి సుశీలాదేవి అమెరికాలోని న్యూజెర్సీ నగరానికి చెందినవారు. స్వామీజీ అమెరికా వెళ్ళివున్నప్పుడు ప్రేరితులై సత్యాన్వేషణలో, సేవచేయుటకై తోటపల్లి శాంతి ఆశ్రమమునకు వచ్చిరి. ఆమె భారతదేశమునకు వచ్చీ రాగానే ఆహారము, భాష, వస్త్రధారణ అన్నింటిని బుద్ధిపూర్వకంగానే కాకుండా బాహ్యంగా కూడ స్వీకరించారు. ఆమె చీరకట్టులో హిందూ మహిళగా జీవించి చూపారు. ఆమెలో ఉన్నతమైన ఋషితుల్య ఆధ్యాత్మిక ప్రేమ మరియు విశ్వాన్నంతటిని ఉత్సాహపరచగలిగే శక్తి కనిపించేది. ఆమె నర్సు అయినం దున, ఆశ్రమంలోను చుట్టుప్రక్క గ్రామాలలోను ప్రజలకు నర్సుగా వైద్య సహాయం అందించేవారు. ఆశ్రమ ఉత్తర ప్రత్యుత్తరాలు టైపుచేయడం, వచ్చిన వారికి భోజన సదుపాయాలు చూడడం చేసేవారు. ఆశ్రమంలోని బాలబాలిక లకు, మూగజీవులకు సేవచేసేవారు. ఆమె ఆశ్రమానికి కార్యదర్శిగా కూడా బాధ్యత నిర్వహించారు. అంతేకాకుండా రవీంద్రనాధ్ ఠాగూర్ వలె చక్కటి హృదయ నివేదనా గీతాలు వ్రాసేవారు. ఆమె "మిస్టిక్ ప్రేయర్స్ అండ్ పోయమ్స్" అనే పుస్తకం వ్రాశారు.

సుశీలాదేవి జంతువుల్ని అందరిలా ప్రేమించడమే కాకుండా, దైవాంశ గలవిగా తలచి సేవచేసేవారు. ఆవులకు కళ్ళనీరు కారినా, కుక్కలకు దెబ్బలు తగిలినా శుభ్రంచేసి, మందులు వేసేవారు. ఒకరోజు అర్ధరాత్రి ప్రక్కగ్రామం నుండల చిన్నదూడ అంబా అంబా అంటూ ఆమె కుటీరం దగ్గర్లో వచ్చి పడి పోయెను. ఆ అంబారావాలు విని లేచి వెళ్ళి దాని డెక్కలో వున్న ముళ్ళుతీసి, శుభ్రపరచి వొళ్ళంతా వేడి నీళ్ళతో ఒత్తి, మెత్తని ప్రక్కవేసి పడుకోబెట్టెను. ఒకసారి పిలుక పిల్లల్ని పెట్టి చనిపోయింది. ఆమె వాటిని అట్టపెట్టెలో పెట్టి సంరక్షించినది. అలాగే దీపం పెడితే వేలాది పురుగులు అందులోపడి చని పోతాయని, దీపం ఆర్పి చీకటిలో కూర్చొని వుండేది. ఒకసారి ఆశ్రమం కుక్క రామీ మీద చిరుతపులి పడి గాయపరిస్తే, రక్తపు మడుగులో వున్న రామీని వైద్యశాలలో చూపించి ప్రాణాలు రక్షించినది. ఆమె ఎద్దుల బండి ప్రయాణం నిషేధించేది. ఎందుకంటే బండితోలేవాళ్ళు ఎద్దులను కొట్టితే ఆమె భరించలేకపోయేది. అందుకే మూగజీవులు తమ కష్ట, సుఖాలను

సోదరి సుశీలగారితో పంచుకునేవి. ఆమె యొక్క దయ, కారుణ్యం, ఫ్లోరన్స్ నైటింగేల్‌ను గుర్తుకు తెచ్చేవి.

శాంతి ఆశ్రమానికి దాదాపు 25 సం।।లు సేవచేసిరి. ఆమె మాతృమూర్తికి అనారోగ్యంవలన అమెరికాకు తిరిగి వెళ్ళిరి. ఆమె కుటీరంలో లేదని తెలుసుకొని మూగజీవులు ఏడ్చేవి. ఆమెకోసం పిల్లలు పరితపించేవారు. అమె లేమికి అమాయకంగా ఒక బాలుడు అనెను. "సోదరి సుశీల వూరికి దారి తెలుసుకోవడానికి నేను ఖగోళశాస్త్రం నేర్చుకొంటున్నాను."

ఆమె జాతి, జాతీయత అన్న ఎల్లలుకూడ దాటి సర్వులయందు సర్వేశ్వరుణ్ణి మాత్రమే చూసేవారు. కొన్నాళ్ళ తర్వాత మరల భారతదేశానికి తిరిగి వచ్చేందుకు సంసిద్ధం అయివున్న తరుణంలో 14-11-1957వ సం।।లో న్యూజెర్సీలో ఆమె మరియు ఆమె సోదరుడు కారు ప్రమాదంలో అశువులు బాసిరి. ఆమె మరణం ఆశ్రమానికి తీరనిలోటుగా పరిణమించెను.

ఆమె మరణం తర్వాత, ఆమెలేని లోటుకు స్వామీజీ అంటారు ఈవిధంగా, "శుకమహర్షి ఇల్లు వదలి, తపస్సు చేయుటకు అడవులకు బయలు దేరి వెళ్ళిపోయినప్పుడు, అతనిపట్ల ఎంతో మక్కువ కలిగిన తండ్రి వ్యాసుడు, శుక...శుక అని పిలుస్తుంటే ప్రకృతంతా ప్రతి స్పందించినదట. ఈ విధంగా సోదరి సుశీల మరణం తర్వాత ఆమెను తలుచుకుంటే శాంతి ఆశ్రమంలో ప్రకృతంతా ప్రతిస్పందిస్తోందని స్వామీజీ అంటారు. తర్వాత ఆమె జ్ఞాప కార్థంగా శాంతి ఆశ్రమంలో మొబైల్ మెడికల్ యూనిట్‌కు "సుశీల పీస్ వాన్" అని, వైద్యశాలకు "సుశీల వైద్యశాల" అని పేరు పెట్టారు.

## సోదరి జ్ఞానేశ్వరి

పాండిచ్చేరి అరవిందాశ్రమానికి మాతృశ్రీ (Mother), కాంజగన్ గాడు రామదాసు గారి ఆనందాశ్రమానికి మాతాజీ కృష్ణబాయి గారలు ఎటులనో ఓంకార స్వామివారి శాంతి ఆశ్రమానికి సోదరి జ్ఞానేశ్వరి అటుల....

స్వామీజీ వ్రాసిన 'నాచెల్లి పునర్జన్మ' (Reincarnation of my sister) అనే పుస్తకంలో కుమారి జ్ఞానేశ్వరి, గత జన్మలో తన ఏకైక ప్రియతమ సోదరి అని, విశేష దైవభక్తి, సోదరాభిమానం కలిగియుంటూ 12వ ఏటనే

మరణించి, దైవభక్తులైన తమ దగ్గర బంధువులింట జన్మించి, బహు చిన్న తనంలోనే (పదవ ఏట) శాంతి ఆశ్రమమునకు చేరి, బాధ్యతగల పెద్దఅక్కవలె అన్నిపనులు చూచుకొనుట ప్రారంభించెనని వివరించేరు.

ఆశ్రమ ప్రాంగణములోనే అక్షరాభ్యాసం, ఆశ్రమం పనులు, విసుగు విరామం లేకుండా చూచుకుంటూనే, బహు శ్రద్ధతో, స్వయం కృషి ద్వారా తెలుగు, ఇంగ్లీషు భాషలలో చదువుట, వ్రాయుట, చక్కగా మాట్లాడుటే గాకుండ ఉభయ భాషలలోను టైపింగు దేశీయులతో, విదేశీయులతో ఉత్తర ప్రత్యుత్తరాలు సాగించుట, రిపోర్టులు, వ్యాసాలు, వ్రాయగల విద్య నార్జించెను. ఆధ్యాత్మిక ఆశ్రమ బాధ్యతలు కుండవలసిన సహృదయం, సభ్యత, సంస్కారములు ఆమెలో మూర్తీభవించాయి.

ఆశ్రమాభివృద్ధికై చేయు ప్రయత్నాలలో, నాలో ఇంకను కొద్దిపాటి అహంకారం ఉంటూందిగాని జ్ఞానేశ్వరి మాత్రము నిరంతరం, నిస్స్వార్ధం, నిరహంకారంతో వర్తించుట నన్నాశ్చర్య చకితుణ్ణి చేసిందని స్వామీజీయే ఆమె జన్మదినోత్సవ సందర్భములో వెల్లడించారు.

శాంతి ఆశ్రమ వాసులైన స్త్రీలు ధ్యానము చేసుకొనుటకై ఏర్పాటు చేయబడిన మైత్రేయ ఆశ్రమమను విభాగమును ప్రారంభిస్తూ శ్రీ స్వామి రామానందతీర్ధ ఇలా అన్నారు. "స్వామి ఓంకార్‌జీ, మానవాళి కిచ్చిన గొప్ప బహుమానం, కుమారి జ్ఞానేశ్వరి. ఆమె సర్వవిధాలుగా సాక్షాత్తు యోగిని. ఆమె సందర్శనం సంతోష దాయకం ఆత్మ సంస్మరణను కల్గించును. స్వామీజీ యొక్క దివ్యశాంతి మహోద్యమ నిర్వహణకు ఆమెయే ఆయన పరమోత్తమ వారసురాలు."

ప్రాపంచిక ఆకర్షణలకు ఏకోశంలోను లోనుగాక సదా సత్య చైతన్యముతో సాక్షాత్తు జ్ఞానేశ్వరిగా, నిరంతరం నిష్కామ కర్మలో నిమగ్నమై నిరాడంబరంగా, వినమ్రతతో విద్యుక్త ధర్మాన్ని నిర్వహించు చున్న నిజమైన ఆధ్యాత్మికాధిపతి, మాతా జ్ఞానేశ్వరి వారు.

# ప్రముఖుల దృష్టిలో స్వామి ఓంకార్

"భూమిపై శాంతి నెలకొల్పుటకై, ఓంకార్ స్వామీజీ సాధించిన ఘన విజయాలకు, ఆయన అందరి హృదయ పూర్వక అభినందనలకు అర్హులు. స్వామి ఓంకార్ మహత్కార్యాలు ద్వేషాన్ని తగ్గించి, ప్రేమను విశేషంగా పెంచి, తద్వారా మానవాళి సాంఘిక, నైతిక స్థాయిని ఎంతో ఉన్నత స్థితికి కొనిపోవును. పవిత్ర లక్ష్యసాధనకై ఆయన అంకితమై సాగిస్తున్న విశిష్ట కార్యక్రమాలు, ఇంకను అనేక సంవత్సరాలు నిర్విఘ్నంగా కొనసాగునట్లు పరమాత్మ అనుగ్రహించుగాక!"

**–శ్రీ స్వామి శివానంద (ఋషీకేశ్) 1963 జనవరి**

జ్ఞానదేవి (మిసెస్ మిల్‌డ్రెడ్ హేవర్డు, (యు.ఎస్.ఎ.) వ్రాసిన "స్వామి ఓంకార్" అను చిన్న పుస్తకానికి ఉపోద్ఘాతం వ్రాస్తూ అందు స్వామి జ్ఞానానంద ఇలా వ్రాశారు.

"అర్ధ శతాబ్దానికి పూర్వం, గోదావరి మండల వాసి అయిన ఒక యువకుడు, బహు చిన్న వయస్సులోనే అంతరంగిక ప్రోత్సాహంచే ప్రాపంచిక జీవితాన్ని త్యజించి దైవ చింతనతో సత్యాన్వేషణకు పూనుకొనెను. ఆ యువకుడే శాంతి ఆశ్రమ వ్యవస్థాపకుడైన స్వామి ఓంకార్. ఆయన సత్యచైతన్యముతో ఏకత్వముపొంది, తన జీవితమును పర బ్రహ్మము యొక్క పవిత్ర కార్యములకు అంకిత మొనర్చుకొనెను. ఈయన ప్రపంచంలో అనేకుల ఆధ్యాత్మిక అభ్యున్నతికి తోడ్పడు చున్నారు.

– స్వామి జ్ఞానానంద

పరమ గురువులు ఋషిరామ్‌రామ్, సాయిబాబా రూపంలో అహూరా మజ్ద (పరమపిత)లతో నిత్య సంబంధము గల ఉన్నతి శ్రేణికి చెందిన **అక్కల్‌టిస్టు శ్రీ మినోచర్.కె. స్పెన్సూర్** (కరాచి).

"స్వామి ఓంకార్, నేను నిరంతరం సంబంధం కలిగి యుంటున్నాము. ఆయనలోని ప్రేమ, దయ, నిజాయితీ, త్యాగ శీలములకు నేను ఆయనను ఎంతో గౌరవంగా చూస్తున్నాను. ఆయన 40 దినముల ఉపవాసంలో వ్రాసిన

(Cosmic Fast) వారి శీలానికి, హృదయానికి, తత్వానికి ప్రత్యక్ష ప్రమాణం.

**-అక్కల్‌టిస్టు శ్రీ మినోచర్.కె. స్పెన్సర్**

"అహురమజ్ద (పరమాత్మ) దృష్టి ఎల్లప్పుడు స్వామి ఓంకార్‌పై ఉంటూనే ఉంది. విశ్వ సంస్కరణోద్యమంలో ఆయన చాలా సహకారిగా యుండును."

**-ఖుషిరామ్‌రామ్** (13-10-1956)

"జీసస్"వలె స్వామి ఓంకార్ కారుణ్యమూర్తి. చాలా చిన్నమాటలతో చెప్పబడినా, హృదయాంతరాళం నుండి వచ్చిన ఆయన ప్రేమ, శాంతి పూరితమైన సందేశములు చదివినా, విన్నా ఎంతో మంచి ప్రభావం కలిగించును. ప్రాప్తించిన దివ్య జ్ఞానాన్ని అందరికి ప్రసారం చెయ్యాలనేది స్వామీజీ సత్సంకల్పము.

**-మహాజ్ఞాని శ్రీహెచ్.ఎన్.స్పెన్సర్,బొంబాయి** (1జనవరి,1953)

"నాకు స్వామి ఓంకార్ ధర్మావతార. ప్రేమ,శాంతి, కాంతులతో నన్ను నిజమైన దైవ సాన్నిధ్యమునకు తీసుకువెళ్ళి జీవితాన్ని ఆనందదాయకం చేశారు స్వామీజీ. నేను చిన్ననాటి నుండి దేవుని ప్రార్థిస్తున్నా. కాని ఆ ప్రార్థనలు దేవుడెక్కడో దూరంగా ఆ స్వర్గంలో ఉన్నాడని, స్వామీజీ ప్రబోధాం మన దైవం ఇక్కడనే, నాలోనే ఉన్నట్లు తెలుసు కొంటిని. ఈ సుజ్ఞానం మన జీవితంమొక దివ్యకార్యముగాఉన్నది".

**-శాంతాదేవి (మేడమ్‌బెట్టీ, ఫారస్టర్, స్విజ్జర్‌ల్యాండ్)**

శిష్యులలో వ్యక్తిగత ఆరాధనను ప్రోత్సహించి వారిని బందీలను చేసే స్వాములు, ఆశ్రమాలవలెగాక, స్వామి ఓంకార్‌జీ ప్రతివ్యక్తికి స్వాతంత్ర్యాన్నిచ్చి ఎవరికి వారు మార్గాన్ని అన్వేషించుకొనుట ద్వారా పురోగమించుటకు దారి చూపును. స్వాతంత్ర్యములోనే అభివృద్ధి కుదని విజ్ఞులు చెప్పుదురు గదా !

రాత్రి ఏ నాలుగు గంటలో తప్ప, మిగిలిన కాలమంతా స్వామీజీ అమితోత్సాహంతో దైవకార్య నిర్వహణకై వినియోగిస్తారు. భౌతిక విజ్ఞానం, ఆధ్యాత్మిక సుజ్ఞానములు సమన్వయం పెంపొందవలసిన ఈ తరుణంలో ఇట్టి విశిష్ట జీవులు ఎంతో అవసరం. **-శ్రీరామానంద తీర్థ 18 ఆగస్టు 1964**

"నేను చూచినకొద్దిమంది జీవన్ముక్తులలోను శ్రీస్వామి ఓంకార్ ఒకరు. ఆయనప్రేమ, దయ, జ్ఞానాలను ప్రసారం చేస్తున్నారు. వారుండే తావులలో ఆధ్యాత్మిక జ్యోతి ప్రజ్వరిల్లుచూ ఉండును. ఓంకార్‌జీ శాంతి దూత, నేనుండే డాలల్లీకి స్వామీజీ ఉండే తోటపల్లి చాలా దూరం. అయినా ఆయనను ఇచ్చట ఉంటూనే తరచు సందర్శించ గలుగు తుంటా.

స్వామీజీ సనాతన ఋషిపుంగవుల దివ్యసందేశాలను ప్రపంచానికి చాటుతూ మాతృదేశపు ఖ్యాతిని ఇనుమడింపచేస్తున్నారు. ఆయన నిర్మించిన శాంతి ఆశ్రమం నిజంగా శాంతి నిలయమే. స్వామీజీ ఆధ్యాత్మిక ప్రభావం ఆశ్రమం అంతట ప్రసరిస్తూ ఉంటుంది. నేను చాలా ఆశ్రమాలు చూచితిని కాని, ఇట్టి ఆశ్రమాలు, బహు అరుదుగా ఉంటవి. స్వామి ఓంకార్‌జీ యొక్క దివ్యప్రేమ, సత్యజ్ఞానము, శాంతి సందేశము ప్రసారం మానవాభ్యుదయ మునకై, లోక కళ్యాణానికై నిరంతరం నిర్విఘ్నంగా సాగుగాక !"

**-శ్రీస్వామి ఆనంద్ (డాలల్లీ) 1973 జనవరి,**

(అఖిలభారత సాధుసమాజ్ కార్యదర్శి)

## శాంతి ప్రార్థన

### (సూక్ష్మములో మోక్షము-లోకశాంతి కొరకు)

శాంతి ప్రార్థన వేదసారమేగాక అన్ని మతముల సారాంశమై యున్నది. ఒక్క ప్రార్థనతోనే మీహృదయ నివాసియగు దైవముతో మాట్లాడగలరు. మీరు పిలిచినంత మాత్రమున దైవము పలుకునన్నట్లు. ఒక్కమారు హృదయపూర్వక ముగా శాంతి ప్రార్థనను జేసిన, ఈ ప్రస్తుత క్షణమునందే దైవ సన్నిధిని మీరు అనుభవించగలరు.

పొలుపుగ పువ్వులు చీరుటకంటెను, కనురెప్ప మూయుట కంటెను, దైవ సన్నిధిని అనుభవించుట సులభము. సౌఖ్యము, సూక్ష్మమని చెప్పబడెను. ఏలనన, దైవము స్వర్గములోను, ఆకాశములోను, దూరముగాను, మనకు భిన్నముగా లేదు. దైవము మనకు పాదములకంటెను, చేతులకంటెను దగ్గరగా యుండెను. ఆయన నేత్రములకు నేత్రముగా, కర్ణములకు కర్ణముగా, మనసులకు మనసుగా, హృదయములకు హృదయముగా, శ్వాసలకు

శ్వాసగా మనలో ప్రతియణువున నిండా నిబిడీకృతమై యుండెను.

అద్వితీయముగా, విడదీయుటకు వీలులేకుండా, రెండుగాకుండా నిరంతరము మనతో ఏకమై మనసర్వస్వముగా ప్రతి అణువులో నిండాయున్న సచ్చిదానంద స్వరూపమును అనుభావించుట ఎంత సూభాగము.

సూక్ష్మములో మోక్షమనగా ఇదియే. ఒక్కమారు శాంతి ప్రార్ధనను స్మరించుచూ దైవమును మన ఆంతర్య, హృదయములో సాక్షి స్వరూపునిగా యున్న, సర్వత్రా నిండాయున్న, సర్వశక్తి మంతుడైన, సర్వజ్ఞుడైన, ఆ దైవ తేజసును అనుభావించుటకు ఇదియే సమయము" ఇదియేతావు.

పెక్కుమాటలు, వ్రాతలుయేల? ఇప్పుడే ఇచ్చటనే, ఈ సూభాగమైన లోకశాంతి ప్రార్ధనను ఒక్కమారు స్మరించుచు, దైవములో విలీ నమయ్యేదము గాక ! శాంతి ప్రార్ధనను స్మరించుచు, మన హృదయమును అఖండమైన శాంతితో నింపి, మన గృహమును స్వర్గధామములుగా జేసుకొందుముగాక! తరించుటకు ఇదియే సమయము. ఏలనన యీ క్షణమే మనది. వచ్చెడు క్షణము మనదికాదు,గాన దైవపరితాపనతో నిండాయుండు నూరుపాళ్ళ మన సుతో హృదయపూర్వకముగా శాంతిప్రార్ధనను స్మరించుచుతరించెదముగాక!

ఇప్పుడే, ఇచ్చటనే ముక్తి, మోక్షము, ఇదియే మన హృదయములో శాంతిని, మన గృహములో శాంతిని, మన సంఘములో శాంతిని, మన దేశములో శాంతిని స్థిరముచేసి ప్రపంచశాంతికి తోడ్పడును. ఏలనన వ్యక్తి శాంతియే లోకశాంతికి దగ్గర మార్గమై శాశ్వతమైన శాంతిని స్థాపింపజేయును. గాక లోకశాంతి ప్రార్ధనను ఇప్పుడు, ఇచ్చటనే గాక, ఎచ్చటయున్న వారచ్చటనే హృదయపూర్వకముగా స్మరించుచు తరించెదరు గాక !

ఈ చిన్న శాంతి ప్రార్ధనను మొదట వాక్కుతోను, తరువాత పెదవుల తోను అటు పిమ్మట మౌనముగా మనసుతోను స్మరించుచు మనము శాంతిని పొంది తరించుటయేగాక సర్వులు శాంతికి తోడ్పడెదము గాక !

నేడే మన హృదయములో శాంతి ఆశ్రమ శాఖను స్థాపించి మన గృహమును స్వర్గధామములుగా జేసుకొని ఆ దివ్య శాంతినే ప్రపంచమంతా ప్రసరింపచేయుచు లోకశాంతికి తోడ్పడెదముగాక!

**శాంతి ప్రార్ధన మీరంతా స్మరించుచు తరించగోరెదము.**

**"తండ్రీ హరిజేరుమనియెడు తండ్రి తండ్రి"** అని చెప్పబడెను గాన దైవమును జేర్చెడు తల్లిదండ్రులే నిజమైన తల్లిదండ్రులుగాన, మనము సదా శాంతి ప్రార్థన స్మరణతో దైవ సన్నిధిననుభవించుచు మన బిడ్డలను, బంధుమిత్రులను దైవమువైపు మరల్చుచు, మన హృదయములను, గృహము లను శాంతి శాఖలుగా జేసుకొని లోక కళ్యాణ మునకు తోడ్పడెదముగాక !

ఇదియే మిమ్ము ప్రేమించెడు మీ అందరి శాంతిని కోరుచున్న మీ ఓంకారుని నిరంతర ప్రార్థన.

సర్వేజనా సుఖినోభవన్తు

ఓం శ్శాంతి శ్శాంతి శాంతిః

## అర్పణ

హృదయములందు గృహములందు శాంతి ఆశ్రమ శాఖలను స్థాపించి విశ్వశాంతికి తోడ్పడుచున్న సోదర సోదరీ మణులందరకు ప్రేమపూర్వకముగా ఈ శాంతి ప్రార్థనను అర్పించు చుంటిని.

లోకా సమస్తా సుఖినోభవంతు

సర్వేషాం స్వస్థిర్భవతు ! సర్వేషాం శాంతిర్భవతు !

సర్వేషాం పూర్ణం భవతు ! సర్వేషాం మంగళం భవతు !

ఓం శ్శాంతి శ్శాంతి శ్శాంతిః హరిః ఓం తత్‌సత్ ఓం.

శాంతి ప్రార్థనలు వివిధ భాషలలో సంస్కృతము, ఆంగ్లము, హిందీ, అరవము, కన్నడము, తెలుగు మొదలైన భాషలలో కావలసినవారు,
శ్రీ శాంతి ఆశ్రమ శాఖలను స్థాపించెడు భక్తవరేణ్యులు, శాంతి ప్రార్థనలను, తదితర కరపత్రములను శ్రీశాంతి ఆశ్రమమును నుండి పొందగలరు. "శాంతి" "PEACE" మాసపత్రికలు
గూడ ప్రతిశాఖకు పంపబడును.

## లోకశాంతి ప్రార్థన

### (సంస్కృతం)

పరమ పూజ్య ప్రసన్న ప్రకాశ స్వరూప !
భవాన్ సర్వేషాం ఉపరి, సర్వేషాం అధః సర్వేషాం అంతః
సర్వేషాం బహిః సర్వేషాం పరితః, సర్వం వ్యాప్య తిష్ఠసి సదా ।
భవాన్ చక్షుషః చక్షుః శ్రోత్రస్య, శ్రోత్రం, హృదయస్య
హృదయం, మనసో మనః శ్వాసస్య శ్వాసః ప్రాణస్య ప్రాణః ఆత్మనః ఆత్మా।
శ్రేష్ఠభగవాన్ ! భవంతం అత్రైవ, అధునైవ, జ్ఞాతుం,
భవదనుగ్రహేణ శక్తిందేహి. ఏతదేకమేవ ప్రార్థ్యతే అస్మాభిః
ప్రాచ్యాం, ప్రతీచ్యాం ఉదీచ్యాం, దక్షిణాయాం
దిక్షు జానంతు సర్వే తవసాన్నిధ్యమ్ ।
ప్రతిజనం, ప్రతి సమూహం, ప్రతిరాష్ట్రం,
శాంతిః సౌహృదం చ విలసితాం,
ఏషా అస్మా కం హృద్యప్రార్థనా, సర్వేషాం శాంతిర్భవతు.

లోకాసుమస్తు సూఖినోభవంతు ! ఓం శ్శాంతి శ్శాంతి శ్శాంతిః

## PEACE PRAYER

Adorable Presence !
Thou who art, within and wthout,
Above and below, and all around.
Thou who art interpenetraing the very cells of our being.

Thou who art, the eye of our eyes, the Ear of our ears,
the heart of our hearts, the mind of our minds,
the breath of our breaths, the life of our lives and
the soul of our souls.
Bless us dear God! to be aware of

Thy presence, Now and Here.
This is all that we ask of thee.
May all be aware of thy presence in the East and the West, and the North and the South.
May peace and goodwill abide
Among individuals as well as
communities and nations.
This is our earnest prayer.
May peace be unto all.
Om Shanti ! Om Shanti !! Om Shanti !!!

## లోకశాంతి ప్రార్థన (హిందీ)

హే పూజనీయ దివ్యస్వరూపా । హే సర్వాంతర్యామీ ప్రభూ ।
ఆప్ హమారే భీతర్ ఔర్ బాహర్ । ఊపర్, నీచే సర్వత్ర వ్యాప్తహో ।
ఆప్ హమారే అంతర్ కే అణు అణు మే నిహిత హో ।
ఆప్ హమారే నయనోంకే నయన్ । కానోంకే కాన్ ।

హృదయోంకే హృదయ్ । మానస్ కే మానస్ । శ్వాసోంకే శ్వాస్ ।
ప్రాణోంకే ప్రాణ్ ఔర్ ఆత్మాకే ఆత్మా బన్‌కర్ ప్రకాశిత్ హో ।

హే ప్రేమకే సాగర్, ఆప్‌కో జాననే పహచాననేకా సౌభాగ్య అభీ యహి ప్రాప్తహో । హే తేజోమయ ప్రభూ । పూరబ్, పశ్చిమ్, ఉత్తర్, దక్షిణ్ ఔర్ సమస్త విశ్వకే లోగ్, ఆప్ కే దివ్య ప్రకాశ్ సే పరిచిత్ హో ।

హే సచ్చిదానంద స్వరూపా మనుష్య మనుష్య కే బీచ్, జాతి జాతికే బీచ్, శాంతి ఔర్ సమరసతా కి స్థాపనా కరో ।

హే ప్రభూ హమారీ యహీ ప్రార్థనా హై ।
లోకాః సమస్తాః సుఖినో భవన్తు ।

ఓం శాంతిః శాంతిః శాంతిః

# లోకశాంతి ప్రార్థన

పూజనీయమైన ఓ దివ్య స్వరూపా !
మా లోపలను వెలుపలను మీదను క్రిందను అంతటను
నిండాయున్న ఓ సర్వాంతర్యామీ ! మా లోపల ప్రత్యణువు
నందును ఇమిడా యుండా మా నేత్రములకు నేత్రము,
కర్ణములకు కర్ణము, హృదయములకు హృదయము,
మనసులకు మనసూ, శ్వాసకు శ్వాస,
ప్రాణములకు ప్రాణము,
ఆత్మలకు ఆత్మవై వెలుగొందు ఓ దేవా !

ప్రేమైక మూర్తీ !
నిన్ను తెలుసుకొను భాగ్యము ఇప్పుడు ఇచ్చటనే
మాకు ప్రసాదింపుము.

ఓ తేజోమయమూర్తి ! తూర్పు పడమరా,
ఉత్తర దక్షిణమూ, ఈ విశ్వము నందంతటను అందరును
నీ దివ్య తేజసును గ్రహింతురు గాక !

ఓ సచ్చిదానంద స్వరూపా !
ప్రతి మానవ హృదయమునందును, నానాజాతి
మధ్యముననను శాంతి సామరస్యమును
ప్రతిష్ఠింపచేయుము.
ఓ దేవా ! ఇదియే మా మనః పూర్వకమైన ప్రార్థన
లోకాసమస్తా సుఖినో భవంతు !

ఓం శ్శాంతి శ్శాంతి శాంతిః

పరమపూజ్య శ్రీశ్రీశ్రీ ఓంకార స్వామివారిచే ప్రపంచ
శాంతికై అర్పించబడిన, అన్నిమతములకు సమ్మతమైన ఈ శాంతి
ప్రార్థనను నిత్యము స్మరిస్తూ మీరు శాంతిని పొంది
లోకశాంతికి తోడ్పడ ప్రార్థన

## తోటపల్లి శాంతి ఆశ్రమ విభాగములు

**జ్ఞానాశ్రమము :** సన్యాసి ఆశ్రమ స్వీకారం చేసినవారు. ఏకాంతముగ మౌనముగ తీవ్రయోగసాధనలు చేసుకొనుటకు పలుగు రెండు గుహలు.

**జనకాశ్రమము :** గృహస్థ జీవితాన్ని వదలి, వాన ప్రస్థాశ్రమాన్ని స్వీకరించి ప్రార్థనలు, ధ్యానాదులు సాగించుకుంటూ ఆధ్యాత్మిక జీవితం గడుపుటకు అనువైన ఏర్పాట్లు.

**మైత్రేయాశ్రమము :** స్త్రీలు ప్రత్యేకంగా ప్రార్థనలు, ధ్యానము మొదలుగు ఆధ్యాత్మిక సాధనలు చేసుకొనుటకు.

**స్వామి రామతీర్థ ఇనిస్టిట్యూట్ :** జిజ్ఞాసువులకు ఆధ్యాత్మిక తరగతులు, సాధనా శిబిరములు నడుపు కేంద్రము. స్వామి ఓంకార్ జీవితము, సందేశము ఆధారంగా "శాంతి" చిత్రములతో కూడిన ప్రదర్శనము కలదు.

**శాంతి తపోవనము :** శివాలయమునకు సమీపంలో గుట్టపై దీర్ఘకాలం ప్రశాంతంగా ధ్యానము చేసుకొనుటకు.

**శాంతి పీఠము :** ప్రపంచశాంతికై శాంతి తరంగాలు ప్రసరింప చేయుటకు భక్తులతో శాంతి ప్రార్థన లిఖిత జపం చేయించి భద్రపరచు పీఠం.

**సుశీల హాస్పటల్ :** ఆశ్రమ వాసులకు, అతిధులకు, పరిసర గ్రామాలకు ఉపయోగపడు (Hospital) ఆసుపత్రి.

**స్పిరిచ్యువల్ హీలింగ్ సెంటర్ :** శారీరక మానసిక రోగాలకు ప్రార్థనల ద్వారా చికిత్సలను చేకూర్చు ఆధ్యాత్మిక కేంద్రం. మరియు ప్రతిదినం విశ్వ కళ్యాణార్థం జపయజ్ఞం, వైదిక హవనం, పాదుకా పూజ జరుపబడుచున్నవి.

**పశువైద్యశాల :** ఆశ్రమం యొక్క పరిసర గ్రామాల వారి పశువులకు చికిత్స చేయును.

**శాంతి విద్యాలయం :** తోటపల్లి కొండలలో 1954వ సం॥లో ప్రాథమిక పాఠశాల ప్రారంభించబడెను. ఆ తర్వాత 1981వ సం॥లో ఉన్నత పాఠశాల ప్రారంభించబడెను. ప్రస్తుతము 150 బాలబాలికలకు ఉచిత భోజనం,

బసఏర్పాట్లతోపాటు ఆధ్యాత్మిక ప్రాతిపదికపై సాధారణ విద్య బోధించబడు తున్నది.

**వృద్ధులకు శరణాలయం :** జాతి, మత, కుల ప్రాంతీయాది వివక్షత లేకుండా నిరాధారులైన వృద్ధులకు ఉచిత భోజనం వసతి వగైరా ఏర్పాట్లు.

**అతిథులకు ఏర్పాట్లు :** ఒంటరిగా గాని, కుటుంబాలతోగాని, సమూహంగా గాని వచ్చు భక్తులు ప్రశాంతంగా గడుపుటకు మరియు చక్కటి వసతి భోజన ఏర్పాట్లు కలవు.

## ప్రభుత్వాలు, ధార్మసంస్థలు, విజ్ఞుల కర్తవ్యం

శ్రీ స్వామి ఓంకార్, ఆధ్యాత్మిక జీవిత అనుభవంగల కారణ జన్ములు, స్వామీజీకి దేశంలోని అన్ని ప్రాంతాల వారితోను, పాశ్చాత్య దేశాల వారితోను ఆధ్యాత్మిక సత్సంబంధాలు కలవు. వారు నెలకొల్పిన సంస్థలు, అవి పనిచేయు విధానం ఆధునికులకు ప్రయోజనకరమైన రీతిని రూపొందింపబడినవి.

1. సనాతన ధర్మమును ప్రస్తుత పరిస్థితులకు అన్వయించి, ఆచరించి అభివృద్ధి చెందుటకు తోడ్పడు రీతిని ప్రబోధించి ప్రపంచ ప్రజల దృష్టిలో భారత ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని ఇనుమడింపజేయుట.

2. సర్వమతములపట్ల సమాదరణతో సమన్వయ పూర్వకంగా సత్యాన్ని చాటుతూ, “సెక్యులర్ స్టేట్”లో ఆధ్యాత్మిక జీవితమును ఎటుల గడపవలసినది ఆదర్శప్రాయంగా వర్తించి చూపుతూ వివరించుట.

3. సత్యము, నిత్యము ఏకత్వమును గ్రహించి ఏవిధమైన విభిన్నత్వ పోకడలకు తావీయక, భారత జాతీయ సమైక్యత వర్ధిల్లుటకు, మానవాళి యావత్తు ధర్మ, ప్రేమల విడనాడక వసుదైక కుటుంబముగా జీవించుటకు మరియు కృషిని నిర్విరామంగా చేయుట.

4. నేటి విజ్ఞానయుగంలో ప్రజలందరు జీవిత ముఖ్యావసరాలకు లోటు లేకుండా జీవిస్తూ, పరమ లక్ష్యం వైపు పురోగమించు రీతిని ఆధ్యాత్మిక ప్రాతిపదికపై సోషలిస్టు నవ సమాజాన్ని నిర్మించుటకు తోడ్పడు ప్రబోధమును చేయుట.

5. ప్రభుత్వ యంత్రాంగముతో సహా, అన్ని రంగాలలోను, అన్ని స్థాయిల లోను అలజడుల అశాంతి ప్రబలియున్న ఈ తరుణంలో, శాంతి దూతగా శాంతి నిలయాలుగా స్వామీజీ వారి సంస్థలు, వ్యక్తి జీవితంలో సంఘ జీవితంలో సుస్థిర శాంతి నెలకొనుటకై ఎడతెగని కృషి చేయుట.

ఈ మహా పురుషుని, వీరి సంస్థల శక్తి సామర్థ్యాలు, సేవ ద్విగుణీ కృతమైన దేశాభ్యుదయానికి, ప్రజాశ్రేయస్సుకు వినియోగపడుట ఎంతేని అవసరం. అట్లు జరుగవలెనన్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు, దేవస్థానముల బోర్డులు, ధార్మిక వ్యవస్థలు, విజ్ఞులైన వ్యక్తులు వీరికి హృదయ పూర్వకంగా ఉదారంగా సహకరించాలి.

జడభరతునికి లేడిపిల్లవలె స్వామీజీకి ఆశ్రమ గురుకుల విద్యాలయం తయారయింది. వెనుకబడిన అనాథ బాలబాలికలకు, మూగ విద్యార్థులకు విద్యగరపు ఈ సంస్థను ఆదర్శ గురుకుల విద్యాలయాలుగా ఎంతో అభివృద్ధి చేయుటకు ఎన్నో అవకాశాలున్నవి. ఈ సత్కార్యముల సఫలీకృతం కావడానికి, సహృదయులందరు సర్వవిధాలముల సహకరించాలి.

## శ్రీ శాంతి ఆశ్రమము - ఆశ్రమ శాఖల అడ్రసులు

పూజ్యశ్రీ ఓంకార స్వాములవారు తరుణ ప్రాయముననే సన్యసించి చాలా సంవత్సరముల హిమాలయములలో తపమాచరించి తపఃసిద్ధులై ఆంధ్రదేశ మునకు తిరిగివచ్చి, తూర్పుగోదావరిజిల్లా, ప్రత్తిపాడు మండలము నందు తోటపల్లి కొండల మధ్యనున్న రమణీయమైన అరణ్యములో కొంత కాలము తపమాచరించిన పిమ్మట దైవప్రేరణచే 1917వ సంవత్స రంలో శాంతి ఆశ్రమమును స్థాపించిరి.

ఆనాటి నుండియు ఆశ్రమము దినదిన ప్రవర్ధమానమగుచు నేటికి సువిశాలమైన (100 ఎకరముల) ఫల, పుష్ప, వృక్ష సముదాయములతో నేత్రానందకరమై యొప్పుచు, అనేకమంది నిరాశ్రయులకు, అనాథ బాలబాలిక లకు ఆశ్రయమై నిరంతరము అన్న, వస్త్ర, విద్య, వైద్యదానము లొనర్చుచు శాంతికాముకులకు, దైవపిపాసులకు ప్రశాంతి నిలయముగా అలరారు

చున్నది. పూజ్యశ్రీ స్వామీజీ పవిత్రాశీసులతో "పీస్", "శాంతి" పత్రికలు ద్వారా ఆధ్యాత్మిక సందేశములు అందించుచున్నది.

సర్వమత సామరస్యము, దీనజనోద్ధరణ, నిస్వార్థ, ప్రేమయుత సేవా జీవితము, ఆశ్రమము చూడవచ్చిన వారిని దైవోన్ముఖముగా జేయుట-శ్రీ స్వామీజీ జీవిత ధ్యేయము. జాతి,మత,కుల,వివక్ష లేక సర్వులకు జ్ఞానగృహ ముగా నిరంతరాశ్రయమిచ్చుటే శ్రీ శాంతి ఆశ్రమ లక్ష్యము.

ఈ మాతృ ఆశ్రమము, వివిధరీతుల అభివృద్ధి నొందుటయే గాక వాల్తేరు కాకినాడ, పిఠాపురం (ఆం.ప్ర) కోటగిరి (తమిళనాడు) మొదలగు అనేక తావులలో ఈ ఆశ్రమశాఖలు అభివృద్ధి చెందుతూ ఆయా ప్రాంతపు భక్తుల ఆధ్యాత్మికాభివృద్ధికి తోడ్పడుచున్నది. దేశ విదేశములందలి శాంతి కోరు భక్తులందరు మాతృ ఆశ్రమ శాఖలను దర్శించుచు, శాంతిని బడసి వెళ్ళు చుండురి. ఇంతకుముందు దర్శించని భక్తులకు, ఆశ్రమమునకు, దైవసన్ని ధికి హృదయ పూర్వక సుస్వాగతము.

## 1.మాతృ ఆశ్రమం : శాంతి ఆశ్రమము

తోటపల్లి కొండలు, వయా శంఖవరం పిన్ : 533 446
తూ॥గో॥జిల్లా. ఫోన్ : 7382009962

## 2. విశాఖపట్నంశాఖ :

లాసన్సుబే , పెద్దవాల్తేరు–530 017 – విశాఖపట్నం
ఫోన్ : 0891–2538689

## 3. విశ్వశాంతి క్షేత్రం :

కైలాసగిరి, విశాఖపట్నం.

## 4. కోటగిరి శాఖ :

Peace Centre, Darmona Rd, KOTAGIRI - 643217
Nilagiri Dist., Tamil Nadu
Ph : 04266-271945

## 5. కాకినాడ శాఖ :

శాంతిఆశ్రమము, అశోక్‌నగర్, కాకినాడ-533 004. తూ॥గో॥జిల్లా

## 6. పిఠాపురం శాఖ :

స్టువార్టుపేట, పిఠాపురం-533 450

## శ్రీశాంతి ఆశ్రమ వివిధ శాఖలలో జరుగు కార్యక్రమములు

### విశాఖపట్నం శాఖ :

- 1966వ సంవత్సరములో శ్రీశాంతి ప్రాథమిక పాఠశాల ప్రారంభించబడెను, ఇపుడు ఉన్నత పాఠశాలగా కొనసాగుచున్నది.
- 1974వ సంవత్సరములో Omkar and Lions school for Deaf and Dumb ప్రారంభించబడినది. విశేషంగా 90 మంది బధిర (చెవుడు, మూగ) బాలురకు ఉచిత నివాసం, భోజన వసతి కూడ ఇవ్వబడుతున్నది. మరియు ఈ పాఠశాలలో వీరికి విద్యతోపాటు ఉపాధి విద్య అంటే విశేషంగా Junior Diploma in Fine Arts & Senior Diploma in Fine arts అని ప్రారంభించబడెను అందులో భాగంగా Hand made Paper making, Bamboo Crafting, Painting, Wood work, Clay work, Stone Carving వంటివి నేర్పబడుచున్నవి.
- శ్రీశాంతి పాఠశాలలోచదివిన విద్యార్థులకు ఉన్నత పాఠశాల విద్య తర్వాత ఇంటర్మీడియయట్ మరియు పాలిటెక్నిక్ వంటి విద్యాకోర్సులలో చేర్పించుట జరుగుచున్నది. అంతేకాకుండా ఆ తర్వాత కూడా ఉన్నత విద్యలకు ప్రోత్సహించి ఆర్థికసహాయం అందించుట జరుగుచున్నది. వీరికి కూడా ఆశ్రమములో ఉచిత నివాస, భోజన వ్యవస్థ కలదు.
- ఆధ్యాత్మిక సాధనలో భాగంగా సత్సంగములు, ఆధ్యాత్మిక ప్రవచనములు జరుపబడుచున్నవి.

h వైద్య సేవలో భాగంగా ఆంగ్ల, హోమియో, వైద్యశిబిరములు నిర్వహించ బడుచున్నవి.

**కోటగిరి (తమిళనాడు) శాఖ :**

h విశ్వశాంతి మెట్రిక్యులేషన్ విద్యాలయ 1980వ సంవత్సరములో స్థాపించబడెను, ప్రస్తుతం 1500 విద్యార్థులు విద్యనభ్యసించుచున్నారు. పేద విద్యార్థులకు విద్యాశుల్కములో సడలింపు కలదు. మరియు విద్యతోపాటు విద్యార్థులకు సంగీతము,కరాటే,క్రీడారంగంలో విశేష ప్రశిక్షణ, ప్రోత్సాహము ఇవ్వబడుచున్నది.

h ప్రతి సంవత్సరము మే నెల పూర్తిగా 2 సాధనా శిబిరములు ఆధ్యాత్మిక జిజ్ఞాసులు కొరకు నిర్వహించబడుచున్నవి.

**కాకినాడ శాఖ :**

h ప్రతి శని, ఆదివారములలో శాస్త్రీయ సంగీతము మరియు శాస్త్రీయ నృత్యము ఉచితంగా నేర్పబడుచున్నది. మరియు యోగ శిబిరములు, సత్సంగములు, ఆధ్యాత్మిక కార్యక్రమములు క్రమబద్ధంగా జరుగు చున్నవి.

విశాఖపట్నం, కోటగిరి, కాకినాడ, పిఠాపురం అన్ని శాఖలలోను స్వామి ఓంకార్ జన్మదినం మరియు ఆరాధన జరుపబడుచున్నవి. మరియు ప్రతినెల పేద వృద్ధులకు బియ్యము, పప్పు వితరణ చేయబడుచున్నది.

# శాంతిని పొందదలచిన సాధకులకు

# స్వాగతం పలుకుతోంది

# శ్రీ శాంతి ఆశ్రమము

అత్యంత రమణీయమైన ప్రకృతి దృశ్యములతో
శ్రీశ్రీశ్రీ ఓంకార స్వామివారి తపశ్శక్తితో
అతి ప్రశాంతమైన వాతావరణములో శ్రీ శాంతి ఆశ్రమము

శాంతి మార్గములో పయనించదలచిన వారికి
స్వాగతం పలుకుంది
సాధులు, సజ్జనులకు,బీద బాలలకు, నిసహాయ వృద్ధులకు
భోజన భాజన విద్యావైద్య సదుపాయములలభింపచేసి
వారి ఉన్నతికి తోడ్పడే శ్రీ శాంతి ఆశ్రమము

శాంతిని పంచిపెట్టదలచిన నిస్వార్థసేవకులకు
స్వాగతం పలుకుతుంది.
హిందువులకు, ముస్లిములకు, క్రైస్తవులకు, బౌద్ధులకు
ఇంకా అన్ని ఇతర మతముల వారికి కూడా
వారి వారి విశ్వాసములకు, సిద్ధాంతములకు
భంగము కలుగని రీతిలో ప్రవర్తించే శ్రీ శాంతి ఆశ్రమము